J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 43 సంచిక : 35 02.02.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## ఎలక్షన్స్-2024 అభ్యర్థుల ఎంపిక

# జగన్ సిద్ధం - బాబు సందిగ్ధం

### వైసీపీ ప్రక్షాళన - టీడీపీ నిరీక్షణ


### బదిలీలు.. భర్తీల బాటలో వైకాపా

### పొత్తుల పాట.. అభ్యర్థుల వేటలో తెదేపా

**వేసవి కాలానికంటే ముందే ఆంధ్రాలో ఎన్నికల వేడి సెగపుట్టిస్తోంది. రాజకీయ వాతావరణం క్రమేణా వేడెక్కుతోంది. అన్ని పార్టీల అధినేతలు తమ సైన్యాధ్యక్షుల ఎంపికపై దృష్టిపెట్టాయి. ఆయా పార్టీల ఆశావహులు కూడా రథాలు, గుర్రాలు, ఏనుగులు, కత్తులు, డాళ్లతో పాటు తమ సైన్యాన్ని సిద్ధం చేసుకుని అధినేతల ఆమోదముద్ర కోసం ఎదురుచూస్తున్నారు. కదనరంగంలో దూకడానికి కుతూహల పడుతున్నారు.**

వైసీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి "నేను సిద్ధం - మీరు సిద్ధమా..?" అంటూ ప్రతిపక్షాలకి సవాలు విసురుతూ ఉత్తరాంధ్ర నుండి ఎన్నికల సమర శంఖం పూరించేశారు. టీడీపీ - జనసేన పార్టీలు ఒకరి భుజాలపై ఒకరు చేతులేసుకుని స్నేహమేరా జీవితం అంటూ "రా కదలిరా.." అని పార్టీ శ్రేణులకు పిలుపిచ్చుకుంటూ వెళ్తున్నాయి. మరోవైపు జీవచ్ఛవంలా పడివున్న కాంగ్రెస్‌కి ఓ వైపు ప్రాణవాయువు (ఆక్సిజన్) అందిస్తూ, మరోవైపు సెలైన్‌లు ఎక్కించుకుంటూ రాజశేఖరరెడ్డి ఇంటి ఆడపడుచు షర్మిలరెడ్డి "నేను నిర్మొహమాటంగా మాట్లాడతాను... ప్రభువు మీద ప్రమాణం చేసి అన్నీ నిజాలే మాట్లాడుతాను, ఏం పీక్కుంటారో పీక్కోండి" అంటూ వాక్బాణాలని సంధించుకుంటూ ఊరూరా తిరుగుతున్నారు. ఆంధ్రాలో ఎవరి సినిమాని జనం ఎంతలా ఆదరిస్తున్నారో నిఘావర్గాల ద్వారా సమాచారం తెప్పించుకుంటూ, తగిన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడానికి

10లో





# పద్మవిభూషణులు

### నెల్లూరుకి ఒకరు ముద్దుబిడ్డ.. మరొకరు దత్తుబిడ్డ

*నెల్లూరుజిల్లాలోని మారుమూల పల్లెలో అతి సామాన్య రైతు కుటుంబంలో పుట్టి, రాజకీయంగా అనితరసాధ్యుడిగా ఎదిగి, భారతదేశ 13వ ఉపరాష్ట్రపతిగా దేశంలోనే రెండవ అత్యున్నత రాజ్యాంగ పదవి అధిరోహించి, అనన్య సామాన్యమైన ఘనత పొందిన నెల్లూరు "ముద్దుబిడ్డ" ముప్పవరపు వెంకయ్యనాయుడు.*

*ఎలాంటి సినీ నేపథ్యం లేని మధ్యతరగతి కుటుంబంలో జన్మించి, నాలుగున్నర దశాబ్దాల క్రితం సినిమా రంగంలో అడుగు పెట్టి, స్వయంకృషితో అప్రతిహతంగా ఎదిగి, సినీవినీలాకాశంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుని, మగధీరుడిగా ఎదిగిన నెల్లూరు "దత్తుబిడ్డ" మెగాస్టార్ కొణిదెల చిరంజీవి.*

*ఈ ఇద్దరికీ భారత ప్రభుత్వం ఇప్పుడు 'పద్మవిభూషణ్' బిరుదు ప్రకటించింది. దేశంలోనే అత్యున్నత రెండవ పురస్కారాన్ని త్వరలో వీరిద్దరూ అందుకోనున్నారు. ఇది నెల్లూరుకు దక్కిన అరుదైన గౌరవం. ప్రతి నెల్లూరీయుడు గర్వించదగిన సందర్భం.*

దేశంలోనే ఎంతో ప్రతిష్టాత్మకమైన 'పద్మవిభూషణ్'.. పురస్కారం ఈసారి ఒకేసారి ఇద్దరు తెలుగువారికి లభించడం తెలుగువారికి గర్వకారణం. ఆంధ్రప్రదేశ్ నుంచి మాజీ ఉప రాష్ట్రపతి, మహోన్నత వ్యక్తి.. మన నెల్లూరు ముద్దుబిడ్డ.. ముప్పవరపు వెంకయ్యనాయుడుకు, ప్రముఖ సినీనటుడు మెగాస్టార్..నెల్లూరు దత్తుబిడ్డ చిరంజీవికి ఈ అవార్డులు రావడంతో తెలుగునేల మురిసిపోయింది. మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా వారు ఈ అవార్డులు అందుకోనున్నారు.

### తెలుగుదనానికి నిండుతనం... మన వెంకయ్య

1949 జులై 1న నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలంలోని చౌటపాళెంలో ఓ సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన మన వెంకయ్య ఆ తర్వాత జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను అధిగమిస్తూ, తన ప్రతిభాపాటవాలతో రాజకీయ రంగంలో ఉన్నత శిఖరాలను అందుకున్నారు. చిన్నప్పుడంతా చదువుకుంది తెలుగులోనే అయినా, ఎంతో ఆసక్తితో హిందీ, ఇంగ్లీష్‌భాషల్లో కూడా పట్టు సాధించి ఆ భాషల్లో కూడా అనర్గళంగా మాట్లాడేవారు. చిన్నతనం నుంచే రాజకీయాలంటే ఆసక్తి. విద్యార్థి దశ నుంచి సమాజం పట్ల అవగాహనతో రాజకీయాల్లోకి వచ్చి, ఆ తర్వాత శాసనసభ్యునిగా, కేంద్రమంత్రిగా కూడా రాణించారు. దేశవ్యాప్తంగా పార్టీ కార్యకలాపాలను విస్తృతం గావించడానికి, ప్రాంతమేదైనా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

3లో



## పొలాలకు నీళ్లివ్వకుండా..
# రైతులను ఏడిపిస్తున్న కాకాణి



• సోమిరెడ్డి మండిపాటు

వ్యవసాయశాఖ మంత్రిగా ఉంటూ కాకాణి గోవర్ధన్‌రెడ్డి పంటలకు నీళ్లివ్వకుండా రైతులను ఏడిపిస్తున్నారని, ఇదేం పద్ధతని మాజీమంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డారు. జనవరి 30న ఆయన పొదలకూరు మండలంలోని దేగపూడిలో 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 530 ఎకరాలకు సాగునీళ్లిచ్చే దేగపూడి ఎత్తిపోతల పునరుద్ధరణ పథకానికి 2018లోనే తాము శంకుస్థాపన చేసి వర్క్‌ఆర్డర్ ఇస్తే, దాన్ని కాకాణి ఆపేశారని విమర్శించారు. అదేవిధంగా బండేపల్లి కాలువను కూడా అర్ధాంతరంగా నిలిపేశారని, మంత్రి తన చిత్తం వచ్చినట్లు వ్యవహరిస్తూ రైతులను వేధించడం సమంజసం కాదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, మల్లికార్జున్‌నాయుడు, సురేష్‌రెడ్డి, పులిపాటి వెంకటరత్నంనాయుడు, అక్కెం సుధాకర్‌రెడ్డి, వి.రాజేశేఖర్‌రెడ్డి, హనుమారెడ్డితో పాటు పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

## తెదేపార్టీతోనే రాష్ట్రాభివృద్ధి - అబ్దుల్ అజీజ్

రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ప్రజలకు సంక్షేమం అందాలన్నా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని, నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కృషి జరుగుతుందని టీడీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ తెలిపారు. జనవరి 29న నెల్లూరులోని 54వ డివిజన్ వెంకటేశ్వరపురంలో ఏర్పాటుచేసిన టీడీపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. రానున్న ఎన్నికల్లో ప్రతి కార్యకర్త పనిచేసి టీడీపీ విజయానికి బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజానాయుడు, విజయభాస్కర్‌రెడ్డి, జహీర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ వస్తేనే ప్రజల సమస్యలకు పరిష్కారం

- పోలంరెడ్డి దినేష్‌రెడ్డి



తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని కోవూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి చెప్పారు. జనవరి 29న కోవూరు నియోజకవర్గం ఇందుకూరుపేట మండలంలోని రాముడుపాళెం గ్రామంలో 'ప్రతి అడుగు ప్రజల కోసం' కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికి వెళ్ళి తెలుగుదేశం పార్టీ ప్రజల కోసం చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైకాపా నాయకులు అరాచకంగా ప్రవర్తిస్తున్నారని, రాజకీయ కక్షసాధింపులతో టీడీపీ నాయకులను, కార్యకర్తలను వేధిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో వైకాపాను ఓడించి, తెలుగుదేశం పార్టీకి విజయం చేకూర్చాలని కోరారు. అనంతరం, శ్రీ చాముండేశ్వరిదేవి అమ్మవారి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు రావెళ్ళ వీరేంద్రచౌదరి, చెంచుకిషోర్‌యాదవ్, బండ్ల ఉదయ్‌కుమార్, సుధీర్, మల్లికార్జున్, చెన్నయ్య, సింధూరకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల నిలయంగా రాష్ట్రం

- టీడీపీ నాయకుడు ధర్మవరం



జగన్ పాలనలో రాష్ట్రం సమస్యల నిలయంగా మారిందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు ధ్వజమెత్తారు. జనవరి 30న నెల్లూరులోని 47, 48 డివిజన్ల పరిధిలోని రాజేంద్ర నగర్ తదితర ప్రాంతాల్లో ఆయన ఇంటింటికీ వెళ్ళి ప్రజలను కలిసి వైకాపా ప్రభుత్వంలోని వైఫల్యాలను తెలియజెప్పారు. అందరికీ టీడీపీ మేనిఫెస్టోను, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజధాని లేని రాష్ట్రంగా వైకాపా ప్రభుత్వం పాలన సాగించడం ఘోరమని, దాదాపు 12 లక్షల కోట్లు అప్పు చేసి చివరికి ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితికి రాష్ట్రం చేరిందని విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రజలు రానున్న ఎన్నికల్లో టీడీపీకి అఖండ విజయం సాధించిపెట్టాలని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యేలా ఆశీర్వదించాలని, అదేవిధంగా నెల్లూరు నగరాభివృద్ధి కోసం పొంగూరు నారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ గణేష్‌కుమార్, రెహమాన్, అద్దంకి చంద్రశేఖర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# జగన్‌వన్నీ అబద్ధాలే!



టీడీపీ నేత ఆనం వెంకటరమణారెడ్డి విమర్శ

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ తనకు మీడియా లేదని, సాక్షి పత్రిక, సాక్షి టీవీతో తనకు అసలు సంబంధం లేదని పలు సభల్లో అబద్ధాలు చెప్తున్నారని, కానీ సాక్షి పత్రికలోనూ, టీవీలోనూ జగన్‌కు, ఆయన కుటుంబానికి వాటా ఉన్నాయని, జగతి పబ్లికేషన్స్ జగన్ కుటుంబానిదేనని తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి అన్నారు. జనవరి 30న నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీకి ఎల్లోమీడియా ఉందని, తనకే ఏమీ లేదని జగన్ పదేపదే చెప్తుండడం విడ్డూరమన్నారు. అవన్నీ జగన్ చెప్పే అబద్ధాలేనని అన్నారు. 'పేపర్ మీద..ఛానల్ మీద..మళ్ళీ ఎల్లో మీడియా అంటూ మాపై విమర్శలా?'..అని ఆయన ప్రశ్నించారు. సాక్షి టీవీ తనది కాదంటూ జగన్ జగన్నాటకాలు ఆడుతున్నారని, అసలు సాక్షి సంగతే తనకు తెలియనట్లు మాట్లాడుతుండడం ఏమిటని ఆయన ఎద్దేవా చేశారు. సాక్షి పత్రిక వైఎస్ కుటుంబం వారిదేనని, లక్ష రూపాయలతో ప్రారంభమైన ఆ పత్రిక ఇప్పుడు కోట్ల రూపాయలకు చేరిందని, పత్రికా ప్రకటనలన్నీ సాక్షికి దోచిపెడుతున్నారని, అంతా అవినీతి డబ్బేనని, తమ ప్రభుత్వం వచ్చాక ఆ కుంభకోణాలన్నీ సీఐడీచే విచారణ జరిపిస్తామని ఆయన పేర్కొన్నారు.

## జగనన్న ఇళ్ల పథకంలో అక్రమాలు

### తహశీల్దార్‌కు బీజేపీ నాయకుని వినతిపత్రం

వెంకటాచలం మండలంలో జగనన్న ఇళ్ళ పథకంలో అర్హులకు మొండిచేయి చూపుతున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు కుంచె శ్రీనివాసులు విమర్శించారు. ఇళ్ళ మంజూరులో అక్రమాలు జరిగాయని, వెంటనే వాటిపై విచారణ జరిపించాలని ఆయన జనవరి 29న లబ్ధిదారులతో కలసి తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక వైకాపా నేత ఒకరు ఎస్సీలకు ఇచ్చిన పట్టాలను ఇవ్వకుండా తమవద్దనే ఉంచుకుని, పైగా ఇచ్చినవారికి మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. గ్రామసభలో ఇవ్వాల్సిన పట్టాలు ఒక నాయకుని ఇంట్లో ఉండడమేమిటని ప్రశ్నించారు. ఇకనైనా అధికారులు జోక్యం చేసుకుని అర్హులైనవారందరికీ ఇళ్ళ పట్టాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## వాగులు, చెరువుల్లో ఇళ్ల స్థలాలేమిటీ?

### బీజేపీ నాయకుడు మిడతల ప్రశ్న

జిల్లాలోని పలు చెరువులు వాగుల్లో కూడా ప్రభుత్వ అధికారులు ఇంటి స్థలాల కేటాయించడం ఏమిటని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ జిల్లా జలవనరుల శాఖ అధికారులను ప్రశ్నించారు. ఆయన ఇటీవల నెల్లూరులోని జల వనరుల శాఖ పర్యవేక్షణ అధికారి కృష్ణమోహన్ దృష్టికి ఈ విషయం తీసుకువెళ్ళారు. వెంకటాచల మండలంలోని కామినేని చెరువులో జలవనరుల శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు కలిసి ఇంటి పట్టాలు ఏర్పాటు చేయడం విచారకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చెరువులను, వాగులను, నదీ స్థలాలను పరిరక్షించమని సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశించినప్పటికీ, వాటిని రక్షించాల్సిన అధికారులే న్యాయ సూత్రాలకు తిలోదకాలు ఇవ్వడం బాధాకరంగా ఉందన్నారు. ఇకనైనా అధికారులు వెంటనే వాటిని పరిశీలించి చేస్తున్న తప్పులను సరిదిద్దుకోవాలని సూచించారు.

## అరాచక పాలనకు అంతిమగీతం పాడాలి

- మాజీమంత్రి పొంగూరు నారాయణ




వైకాపా అరాచక పాలనకు ప్రజలు అంతిమగీతం పాడాలని మాజీమంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ పిలుపునిచ్చారు. జనవరి 29న నెల్లూరులోని 7, 46 డివిజన్లలో ఏర్పాటుచేసిన 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం జగన్ ప్రజలను ఎప్పుడో విస్మరించారని, ఆ నలుగురు ఇచ్చే సలహాలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారని, ఏ రాష్ట్రంలో లేనివిధంగా ప్రజలపై చెత్తపన్ను కూడా వేసి నానా బాధలు పెడుతున్నారని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో వైకాపాను ఓడించి, సుపరిపాలన అందించే తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు ఆనం రంగమయూర్‌రెడ్డి, కరిముల్లా, కోకు మహేందర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, విజేత, శోభన్‌బాబు, మణిశేఖర్, లోకేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా మాటలు నమ్మకండి

• 'జనసేన' నాయకుడు సుజయ్‌బాబు

వైకాపా మాటలు నమ్మవద్దని, ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ వైకాపా నాయకులు మాయమాటలతో ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారని జనసేన నెల్లూరు నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు విమర్శించారు. జనవరి 30న నెల్లూరు 42వ డివిజన్ ఖుద్దూస్‌నగర్‌లో ఆయన టీడీపీ నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్ళి ప్రజలను కలుసుకుని మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక జగన్ తుంగలో తొక్కారని, వైకాపాకి చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. ఎన్నికలు దగ్గరపడేకొద్దీ మళ్ళీ మాయమాటలు చెప్పి ప్రజలను మభ్యపెట్టేందుకు సిద్ధపడుతున్నారని, ప్రజలెవరూ వారి మాటలు విని మోసపోవద్దని చెప్పారు. ఏకంగా ఎనిమిదిసార్లు విద్యుత్ చార్జీలను పెంచిన ఘనత వైకాపాకే దక్కిందని ఆయన ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి షేక్ అలియా, 43వ డివిజన్ జనసేన ఇన్‌చార్జి అమీర్‌జాన్, జనసేన నగర నాయకులు అజయ్‌బాబు, సాయిమోహన్, ప్రతాప్, శేషయ్య, తెలుగుదేశం నాయకులు అలీ, మున్నా పాల్గొన్నారు.

## 'జై భారత్'ను గెలిపించండి

### --- ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరామరాజు ---

రానున్న ఎన్నికల్లో 'జై భారత్' పార్టీని గెలిపించాలని, ఆమేరకు ప్రజలు ఒకసారి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ ఉదయగిరి నియోజకవర్గం ఇన్‌చార్జి ముప్పాళ్ల శ్రీరామరాజు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జనవరి30న మండలకేంద్రమైన సీతారామపురంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కుటుంబపాలన, వారసత్వ రాజకీయాలకు స్వస్తి చెప్పేందుకు, అవినీతిరహిత పారదర్శక పాలన అందించేందుకు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ సమున్నతమైన ఆశయాలతో 'జై భారత్' జాతీయపార్టీని స్థాపించారని, మెరుగైన నాయకత్వం కోసం తమ పార్టీకి విజయం చేకూర్చాలని ఆయన కోరారు. తాను డీఎస్పీ స్థాయిలో రిటైరై రాజకీయాల్లోకి వచ్చానని, ఉదయగిరి నియోజకవర్గం ప్రజలు తనకు ఒకసారి అవకాశం ఇస్తే ఉదయగిరి అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానన్నారు. ప్రజలు ఆలోచించి తనకు ప్రజాసేవ చేసే భాగ్యం కల్పించాలని ఆయన విజ్ఞప్తిచేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ళ రామరాజు, కొండమూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరునగర వైసీపీ సీటు ఖాళీ!



రేసులో ప్రశాంతిరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, ద్వారకానాథ్, రూప్‌కుమార్

మొత్తానికి నెల్లూరు నగరం వైసీపీ సీటు ఖాళీ అయ్యింది. సవాళ్ళకి, ప్రతిసవాళ్ళకి, ఛాలెంజ్‌లకి, ఛేజింగులకి తెరపడింది. ఇక్కడ శాసనసభ్యుడిగా వున్న అనిల్‌కి ప్రమోషన్ ఇచ్చి నరసరావుపేట పార్లమెంటు అభ్యర్థిగా పంపించేశారు అనిల్ బాస్ జగన్. దంత వైద్య పట్టా పుచ్చుకుని వైద్యుడిగా స్థిరపడాల్సినవాడు అనూహ్యంగా రాజకీయ ప్రవేశం చేశాడు అనిల్. కౌన్సిలర్‌గా తన పొలిటికల్ ప్రస్థానాన్ని ప్రారంభించి, రెండుసార్లు శాసన సభ్యుడిగా గెలిచి, కొంత కాలం మంత్రిగా కూడా పనిచేశాడు. ఇప్పుడు ఆయనకి జాతీయస్థాయి గుర్తింపు కల్పించారు సీఎం జగన్. గతంలో నేదురుమల్లి జనార్ధనరెడ్డి , మేకపాటి రాజమోహనరెడ్డి లాంటి రాజకీయ దిగ్గజాలు నెల్లూరు నుండి వెళ్ళి నరసరావుపేట నుండి పోటీచేశారు. ఇప్పుడు అలాంటి అవకాశమే అనిల్‌కి వచ్చింది.

సరే... ఆయన వెళ్ళిపోయాడు. అయితే, ఇక్కడ అభ్యర్థి ఎవరు? ఇదీ ఇప్పుడు ప్రశ్న. ప్రచారంలో చాలా పేర్లు చక్కర్లు కొడుతున్నాయి. ముందుగా రాజ్యసభసభ్యులు సేవభూషణ్ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేరు వెలుగులోకి వచ్చింది. ఆ తరువాత ప్రస్తుత ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి పేరు కూడా ప్రముఖంగానే వినపడింది. అయితే ఇక్కడ కుల సమీకరణలు ముఖ్యపాత్ర పోషిస్తాయంటున్నారు పార్టీ శ్రేణులు. కందుకూరు రెడ్డి సామాజిక వర్గానికి ఇస్తే, నగరం వైశ్య, బీసీ లేదా మైనారిటీలకు ఇస్తారని ఊహాగానాలు చేస్తున్నారు. అలా జరిగే పక్షంలో వైశ్య సామాజికవర్గం నుండి నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్, బీసీ వర్గాల నుండి డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, మైనారిటీల నుండి రెండు పేర్లు వినపడుతున్నాయి. ప్రశాంతిరెడ్డి అయితేనే గట్టి పోటీ ఇవ్వగలరని, ఇంకెవరైనా నారాయణ ముందు కష్టమే అని కూడా అంటున్నారు. అయితే, పార్టీ నిర్ణయమే శిరోధార్యం అని అందరూ వదిలేస్తే.. పార్టీ ప్రకటించేవరకు అభ్యర్థి ఎవరన్న సస్పెన్సు కొనసాగాల్సిందే!

# పద్మవిభూషణులు

(మొదటి పేజీ తరువాయి)



'పద్మవిభూషణ్' ప్రకటించిన సందర్భంగా హైదరాబాదులో వెంకయ్యతో తన ఆనందాన్ని పంచుకుంటున్న మరో పద్మవిభూషణ్ గ్రహీత చిరంజీవి

వెనుకంజ వేయలేదు. అది ఆయన నిబద్ధతకు, ధీరత్వానికి నిలువెత్తు నిదర్శనం. మంచికి-మానవీయతకి ఆయన పెట్టిందిపేరు. ప్రజలంటే ఆయనకెంతో అభిమానం. పేద గొప్ప తేడాలేకుండా కలిసిపోవడం, అరమరికలు లేకుండా మాట్లాడడం ఆయన నైజం. అయినా, తానెంత ఎత్తుకు ఎదిగినా కన్నతల్లిని, మాతృభూమిని మరువలేదు. మాతృదేశం పట్ల, మాతృభాష పట్ల ప్రతిఒక్కరూ కృతజ్ఞతతో ఉండాలని, తామెక్కడ ఎంత ఉన్నతస్థాయిలో ఉన్నా దేశభక్తితో దేశపురోభివృద్ధికి పాటుపడాలని ఆయన కోరుకునేవారు.

## ఏ పదవిలో ఉన్నా తనదైన ముద్ర :

రాజకీయరంగంలో ఏ పదవిలో ఉన్నా ఆయన తనదైన ముద్రతో ప్రజల మనసును చూరగొన్నారు. తాను ఏ స్థాయిలో ఉన్నా ఎల్లవేళలా ప్రజల పక్షం వహించి ప్రజాసమస్యల పరిష్కారానికి అలుపెరుగని కృషిచేయడంలో ఆయనకాయనే సాటి. రాష్ట్ర శాసనసభలో ఆయనకు 'అసెంబ్లీ టైగర్' అని పేరు. ఆ తర్వాత కేంద్రమంత్రిగా దేశప్రజలకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి తనవంతు సేవలందించారు. తనకెంత గొప్ప పదవి



'పద్మవిభూషణ్' గ్రహీతకి శుభాభినందనలు తెలియజేస్తున్న నెల్లూరీయుడు, ప్రముఖ శాస్త్రవేత్త డా. గుండ్రా సతీష్‌రెడ్డి

చేయడానికే ఆయన ఎక్కువ సమయం కేటాయించేవారు! అసామాన్యమైన తన ప్రతిభాపాటవాలతో దేశవ్యాప్త ఖ్యాతిని తెచ్చుకుని అటు రాష్ట్రానికి, ఇటు దేశానికి ఎనలేని సేవలందించిన ఘనత ఒక్క మన వెంకయ్యాకే దక్కిందంటే అతిశయోక్తి కాదు.

## నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం :

నెల్లూరులోని వీఆర్ కళాశాలలో డిగ్రీ చదువుకుంటున్న రోజుల్లోనే ఆర్ఎస్ఎస్‌తో అనుబంధం పెంచుకున్నారు. ఏబీవీపీ లోనూ పనిచేశారు. అలా కార్యకర్తగా రాజకీయ జీవితాన్ని ఆరంభించి స్వయంకృషితో నేతగా..మహానేతగా ఎదిగారు. బీజేపీ జాతీయ అధ్యక్షునిగా దేశవ్యాప్తంగా పర్యటించి దేశప్రజలకు అభిమానపాత్రులయ్యారు. అద్భుతమైన వాగ్ధాటి, అద్వితీయమైన ఉపన్యాస శైలి ఆయన సొంతం. ఏది మాట్లాడినా హృదయానికి హత్తుకుపోయేవిధంగా సూటిగా-స్పష్టంగా ఉండడం అనితర సాధ్యమైన ఆయన భాషా ప్రతిభకు తార్కాణం. జై ఆంధ్ర ఉద్యమంలో ఆయన పాత్ర కీలకం. 1974 ప్రాంతాల్లో జయప్రకాశ్ నారాయణ్ ఆధ్వర్యంలోని అవినీతి వ్యతిరేక ఉద్యమానికి కన్వీనర్‌గా పనిచేయడం ఆయన నీతి నిజాయితీలకి నిదర్శనం. ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు ఆ సమయంలో ఆయన జైలుకు కూడా వెళ్ళారు. కుటుంబాన్ని వదిలిపెట్టి అప్పట్లో ఎన్నో బాధలు పడినా ఆయన ఏనాడూ వెరవలేదు. తాను నమ్ము కున్న సిద్ధాంతాలకి కట్టుబడి పనిచేయడంలో ఎన్ని కష్టనష్టాలున్నా



తమ గురువుకి 'పద్మవిభూషణ్' ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ.. ఆయనను కలిసి అభినందిస్తున్న శిష్యులు వై.సత్యకుమార్, ఏ.శ్యామ్‌కుమార్, కే.విక్రాంత్

వచ్చినా ఏనాడూ గర్వపడింది లేదు. పదవుల కోసం ఆయనెప్పుడూ పాకులాడ లేదు. పదవులే ఆయన్ను వరించాయి. దేశంలోనే ప్రతిష్టాత్మకమైన..సమున్నతమైన ఉప రాష్ట్రపతి పదవిని అధిష్టించినా కూడా ఆయనెప్పుడూ విశ్రాంతి ఎరుగరు. భారత 13వ ఉప రాష్ట్రపతిగా ఉన్నా, ఢిల్లీలోని ఉప రాష్ట్రపతి నివాసానికే పరిమితం కాకుండా, నిరంతరం దేశవ్యాప్తంగా ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొంటూ దేశభ్యున్నతికి బాటలు వేసేందుకు ఆయన పరితపించారు. ఎంతో కీలకమైన విద్య, వైద్య రంగాల్లోనూ, దేశానికి వెన్నెముక అయిన వ్యవసాయరంగంలోనూ అభివృద్ధికి పాటుపడ్డారు. దేశంలో పలుచోట్ల రహదారులు, రైలుమార్గాల ఏర్పాటుకు కూడా కృషిచేశారు.

అంతేకాదు, పేదలకు-దీనులకు, అసహాయులకు అభాగ్యులకు సేవచేయడమన్నా ఆయనకెంతో ఇష్టం. సేవా రంగమంటే ఆయనకెంత మక్కువో చెప్పలేం. 'స్వర్ణభారత్ ట్రస్ట్' ఏర్పాటుకు మార్గదర్శనం చేయడం, తద్వారా గ్రామీణ ప్రాంత ప్రజల అభ్యున్నతికి నేటికీ అవిశ్రాంతంగా నిరుపమానమైన సేవలందిస్తుండడం ఆయన సేవానిరతికి ప్రతీక. తెలుగునేలకే కాక, దేశానికే స్ఫూర్తిదాయకమైన సేవలందిస్తున్న మహనీయమూర్తి.. మహోన్నత సేవాదీప్తి.. భారత ప్రజాస్వామ్య విజయ పతాక.. తెలుగుజాతి రత్నం.. మన వెంకయ్యనాయుడుకు 'పద్మవిభూషణ్' పురస్కారం లభించడం సింహపురిసీమకే కాక, సకల భారతావనికే గర్వకారణం!...

## అభిమానుల సంబరాలు

వెంకయ్యకు కేంద్రప్రభుత్వం 'పద్మవిభూషణ్' పురస్కారాన్ని ప్రకటించడంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. వెంకయ్యతో పాటు 'పద్మవిభూషణ్' గౌరవాన్ని అందుకోనున్న మెగాస్టార్ చిరంజీవి స్వయంగా ఆయన నివాసానికి వెళ్ళి శుభాకాంక్షలు తెలిపారు. తాను విద్యార్థిగా నెల్లూరులో చదువుకుంటున్న తరుణంలో వెంకయ్యనాయుడి పిలుపుతో 'జై ఆంధ్ర' ఉద్యమంలో పాల్గొన్నానని ఈ సందర్భంగా చిరంజీవి చెప్పడం, నెల్లూరుతో మెగాస్టార్‌కి ఉన్న అనుబంధానికి నిదర్శనం. పలువురు ప్రముఖులు, వెంకయ్య అభిమానులు ఆయనను కలిసి అభినందనలు అందజేస్తున్నారు. జిల్లా బీజేపీ నాయకులు వెంకయ్య పట్ల తమ అభిమానాన్ని చాటుకుంటూ నెల్లూరు నగరంలో వేడుకలు చేసుకోగా, వెంకటాచలంలోని 'స్వర్ణభారత్' ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ తమ సంతోషాన్ని పంచుకుంటూ సంబరాలు చేసుకున్నారు. భారత అత్యున్నత పురస్కారం 'భారతరత్న' కూడా ఆయన అందుకోవాలని అందరూ కోరుకుంటున్నారు.

తమ తమ రంగాలలో ఎవరికివారే సాటిగా మేటిగా నిలిచి నెల్లూరు ఖ్యాతిని ప్రపంచస్థాయిలో ప్రకాశింపచేసిన మాన్యులు ముప్పవరపు వెంకయ్యనాయుడికి, అసామాన్యులు కొణిదెల చిరంజీవికి 'లాయర్' అభినందనలు.



'పద్మవిభూషణ్' గ్రహీతకి శుభాకాంక్షలు తెలియజేస్తున్న డాక్టర్ కిషోర్స్ రత్నం అధినేత డా. కే.కృష్ణకిషోర్



తమ పెద్దాయనకి అభినందనలు తెలుపుతున్న కే.సుధాకర్‌రెడ్డి, పి.సురేంద్రరెడ్డి, కే.పరమేశ్వర్‌రెడ్డి

# 'అందరివాడు'గా నిలచిన 'విజేత' చిరంజీవి!

దాదాపు 45 సంవత్సరాల క్రితం అంటే, 1978లో తన సినీ ప్రస్థానాన్ని ప్రారంభించారు చిరంజీవి. ఆయన జన్మస్థలం కృష్ణాజిల్లా మొగల్తూరు. కానీ, ఆయన సినీరంగ ప్రవేశం జరిగింది మాత్రం నెల్లూరు నుండే. దాదాపు రెండు దశాబ్దాల పాటు నెల్లూరునగరం కేంద్రంగానే చిరంజీవి నట ప్రస్థానం కొనసాగింది. ఆయన, ఆయన సోదరుడు నాగబాబు వీఆర్ కాలేజీ విద్యార్థులే. మరో తమ్ముడు పవన్ కల్యాణ్ దర్గామిట్టలోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో చదివారు. చిరంజీవి చెల్లెళ్ళు కూడా డీకేడబ్ల్యూ కళాశాలలో చదువుకున్నవాళ్ళే. వాళ్ళ తండ్రి వెంకట రావు జిల్లాలో ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న తరుణంలో ఆ కుటుంబం నెల్లూరుతో ఎనలేని అనుబంధాన్ని పెనవేసుకుంది. ఫతేఖాన్‌పేట ఎదురుగా అక్కంవారి వీధిలో సొంత ఇంటిని నిర్మించుకుని ఆ కుటుంబమంతా ఇక్కడే స్థిరపడింది. చిరంజీవి నట జీవితం ప్రారంభమైన తొలినాళ్ళలో ఆయన తరచూ నెల్లూరుకి వచ్చి వెళ్ళేవారు. నెల్లూరీయులంతా "మనవాడు గొప్ప నటుడవుతున్నాడు" అని గొప్పగా చెప్పుకునేంతగా చిరంజీవి నెల్లూరీయులతో తన బంధాన్ని పెంచుకున్నారు. చాలా సందర్భాలలో ఆయన తనని తాను నెల్లూరీయుడిగానే చెప్పుకునేవారు. నిజానికి ఆయన నటజీవితాన్ని ఊహించని మలుపుతిప్పిన సినిమా 'ఖైదీ'. సంయుక్త మూవీస్ బ్యానర్‌పై ఆ చిత్రాన్ని నిర్మించిన నిర్మాత డాక్టర్ యం.తిరుపతి రెడ్డిది కూడా నెల్లూరు కావడం విశేషం. అందుకే ఆయన నెల్లూరుకి దత్తపుత్రుడు.

తరువాతి కాలంలో చెన్నై, అక్కడినుండి హైదరాబాదుకి చిరంజీవి కుటుంబం తరలిపోయింది. అంచలంచెలుగా ఎదుగుతూ, ఎదిగేకొద్దీ ఒదుగుతూ తన కెరీర్ మలుచుకున్న చిరంజీవికి ఇప్పటికీ నెల్లూరన్నా, నెల్లూరు వాసులన్నా చాలా ఇష్టం.

సినిమా రంగంలో తనకి ఎలాంటి 'గాడ్‌ఫాధర్'లు లేక పోయినా, జీవితాన్ని "ఛాలెంజ్"గా తీసుకుని "తిరుగులేని మనిషి"గా ఎదిగారు. అటు సినిమారంగంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా 'ఆపద్బాంధవుడు'గా మారి 'బిగ్‌బాస్'గా అవతరించారు. "చిరంజీవి" బ్లడ్‌బ్యాంకు ద్వారా సేవారంగంలో కూడా "హీరో"గా నిలిచారు.

రాజకీయ రంగంలో అరంగేట్రం చేసి కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ద్వారా "చక్రవర్తి"గా మారి "అందరి వాడు"గా పిలిపించుకుంటూ నాడు పద్మభూషణుడై, నేడు పద్మ విభూషణుడై 'విజేతగా' అత్యున్నత శిఖరాలని అందుకున్నారు.

లాయర్
ఫిబ్రవరి 02, 2024

# పౌష్టికాహార లోపం.. ప్రజలకు శాపం

'ఆరోగ్యమే సౌభాగ్యం' అన్నారు పెద్దలు. మంచి ఆరోగ్యానికి పోషకాహారం ఎంతైనా అవసరం. అయితే, మన దేశంలో అత్యధికశాతం మంది ప్రజలకు సరైన పౌష్టికాహారం లభించడం లేదు. పుష్టికరమైన ఆహారం కాదు కదా, ఆకలి తీర్చుకునేందుకు అవసరమైన సాధారణ ఆహారం కూడా ఎంతోమందికి కొరతగానే ఉంది. పస్తులతో బాధపడేవారు, అర్ధాకలితో అలమటించేవారు దేశంలో కోకొల్లలుగానే ఉంటున్నారు. ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మనదేశం రూపుదిద్దుకోబోతోందని పాలకులు గొప్పగా చెప్పుకుంటున్నా, మరోవైపు దేశంలో నిరుపేదలు, అసహాయుల పరిస్థితి దయనీయంగానే ఉంటోంది. ఏళ్ల తరబడిగా ఆ దుస్థితిలో పెద్దగా మార్పేమీ ఉండడం లేదు. ఒకవైపు పేదరికం, మరోవైపు నిరుద్యోగం, ఇంకోవైపు ఆర్థిక అసమానతలు దేశాన్ని కుంగదీస్తూనే ఉన్నాయి. దాదాపు 70 శాతం మంది ప్రజలకు సరైన ఆహారం ఉండడం లేదని, దీంతో దేశంలో ఏటా దాదాపు 17 లక్షల మంది వరకు మృత్యువాత పడుతున్నారని కూడా అధ్యయనాలు స్పష్టం చేస్తూనే ఉన్నాయి. ఇలాంటి వాస్తవ పరిస్థితులను పరిశీలించి, ఆచరణాత్మకమైన విధానాలతో పేదరికం నుంచి దేశాన్ని గట్టెక్కించాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం విచారకరం. సరైన పోషకాహారాలు లేక చిన్నారులు, యువత సైతం బక్కచిక్కిపోతున్న దుస్థితి మన పాలకులకు కనిపించకపోవడం బాధాకరం. కేవలం పౌష్టికాహార లోపంతో ఏటా లక్షలాదిమంది చిన్నారులు కూడా కన్ను మూస్తున్నా ప్రభుత్వాల్లో చలనం ఉండడం లేదు. పాశ్చాత్య వంటకాల మోజులో, ఎంతో ఆరోగ్యకరమైన భారతీయ ఆహారపుటలవాట్లు మట్టికొట్టుకుపోతున్నాయి. పరిశుభ్రమైన ఆహారం అన్నదే కనిపించడం లేదు. ఎక్కడ చూసినా కల్తీయే రాజ్యమేలుతోంది. ప్రజారోగ్యాన్ని పట్టించుకోకుండా ధనార్జనే ధ్యేయంగా వ్యాపారులు కల్తీ సరుకులను యథేచ్ఛగా అమ్మేస్తున్నారు. రుచీపచీ లేని పదార్థాలు, నాసిరకం వంటకాలను తింటూ జనం రోగాల పాలవుతున్నారు. కల్తీ పదార్థాలు తినడం వల్ల ప్రజారోగ్యానికి ఎంత ముప్పో తెలిసినా వాటిని నియంత్రించడానికి పాలకులు తీసుకుంటున్న చర్యలేమీ ఉండడం లేదు. ఫలితంగా, చిన్నవయసులోనే మధుమేహం (షుగర్ వ్యాధి), గుండెజబ్బులు, ఊబకాయాల వంటి సమస్యలు ప్రజలను చుట్టుముడుతున్నాయి. అనేక రకాల క్యాన్సర్లు ముంచుకొచ్చి ప్రాణాలు తీస్తున్నాయి. పంటపొలాల్లో రసాయన ఎరువులు విపరీతంగా వాడుతుండడం వల్ల కూడా క్యాన్సర్ జబ్బులు పెరుగుతున్నాయని, ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో క్యాన్సర్ మరణాల సంఖ్య మరింతగా పెరుగుతుందనే నిపుణుల ఆందోళనను ఎవరూ పట్టించుకోవడం లేదు. మరోవైపు ప్రజలు నిత్యం వినియోగించుకునే ఆకుకూరలు, కాయగూరలకు సైతం రసాయనాలు విరివిగా వాడుతుండడం వ్యవసాయ ఉత్పత్తులపై వాటి వాడకం అధికంగా ఉండడం, నకిలీ పురుగుమందుల ప్రభావం వంటివన్నీ ఆరోగ్యానికి ప్రమాదకరంగా పరిణమిస్తూనే ఉన్నాయి. ఎలాంటి ఇబ్బందిలేని సేంద్రీయ సాగు విధానాలకు ఆశించిన ప్రోత్సాహం ఉండడం లేదు. పంట పొలాలకు వాడే నీరు కూడా కలుషితంగానే ఉండడం, మురుగునీటి నీటిని శుద్ధి చేయకుండానే పొలాలకు వాడుతుండడంతో వాటి ద్వారా పండుతున్న పంటలు, వ్యవసాయ ఉత్పత్తులు ప్రజారోగ్యానికి ప్రమాదకరంగా తయారవుతున్నాయని నిపుణులు ఎంతగా చెప్తున్నా పాలకుల చెవికెక్కడం లేదు. తాగునీరు కూడా కలుషితమై తద్వారా మరిన్ని వ్యాధులు ప్రజలకు సంక్రమిస్తున్నాయి. పోషకాహార పదార్థాలు లేని ఆహారం ఎంతగా తిన్నా ప్రయోజనం ఉండదు. అంతేకాదు, దేశంలో అడ్డూఅదుపూ లేకుండా పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు పేదా సాదాకే కాదు, కోట్లాదిమంది మధ్యతరగతి ప్రజలకు కూడా చుక్కలు చూపిస్తున్నాయి. అన్ని రకాల పంటల ఉత్పత్తులకు ధరలను నిర్ణయించి, రైతులకు గిట్టుబాటు కల్పించాలనే ఆలోచనే ప్రభుత్వాలకి ఉండడం లేదు. ఎన్ని కల్తీలు జరిగినా, మార్కెట్లో ఎన్ని మోసాలు జరిగినా, తాగే నీరు, తినే ఆహారం కలుషితమై ప్రజలు రోగాలు రొష్టులతో బాధలు పడుతున్నా ధరలను నియంత్రించేవారు లేరు. కల్తీలను అరికట్టే నాథులే లేరు. ప్రభుత్వాలు ఇకనైనా వీటిపై దృష్టిపెట్టి ప్రజలకు సరైన పౌష్టికాహారం అందించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. సేంద్రీయ సాగువిధానాలు దేశవ్యాప్తంగా ముమ్మరంగా జరిగేలా రైతాంగాన్ని ప్రోత్సహించాలి. తాగునీటి వసతులు, జలవనరులు కలుషితం కాకుండా కాపాడాలి. ఏదేమైనా, ప్రజా రోగ్యానికి శాపంగా పరిణమించిన పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవడం, ఆహార భద్రత కల్పించి ప్రజలకు సురక్షితమైన ఆహారాన్ని అందించడం ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం!..

# తిరుమల దర్శనంలో కూడా ఓట్ల రాజకీయం!

రెండువారాల క్రితం మన 'లాయర్'లో 'దేవుళ్ళు – రాజకీయాలు' అంటూ 'సత్యపీఠం'లో రాసిన మాటలు అక్షర సత్యాలు. తమ స్వప్రయోజనాల కోసం, రాజకీయ పరపతి, లబ్ది కోసం దేవాలయాలను, వాటి ట్రస్టులను రాజకీయ నాయకులు అపవిత్రం చేస్తున్నారు. దేవుళ్ళకి కూడా రాజకీయ బురద అంటిస్తున్నారు. ముఖ్యంగా వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరుమల తిరుపతి దేవస్థానాలు రాజకీయ నిరుద్యోగులకు ఉపాధి వేదికలుగా మారిపోయాయి. ప్రభుత్వం తమ ఇష్టానుసారం బోర్డు సభ్యుల సంఖ్యని పెంచేస్తే, కోర్టులు అడ్డుకున్న సంగతి మనకి తెలిసిందే. శాసనసభ్యులకు ఉన్న దర్శనం కోటాలో కూడా షరతులు విధించారు. శాసనసభ్యుడి సిఫారసుతో ఎవరైనా దర్శనానికి వెళ్తే, ఆ వెళ్లిన భక్తులు ఆ ఎంఎల్ఏ నియోజకవర్గం వాళ్ళే అయ్యి ఉండాలన్న నిబంధన టీటీడీ అధికారులు విధించారు. సదరు భక్తులు సిఫారసు చేసిన శాసన సభ్యుడి నియోజకవర్గ పరిధిలో ఉన్నారా.. లేదా..? అని వారి ఆధార్‌కార్డు ద్వారా గుర్తిస్తారట. ఏ శాసనసభ్యుడికైనా తన నియోజకవర్గం ఓటరుకి తప్ప మిగిలిన వారికి దర్శనం సిఫారసుచేసే అవకాశం లేదు. అంటే తిరుమల స్వామివారి దర్శనాన్ని కూడా తమ రాజకీయ స్వార్థానికి వాడుకునేలా నిబంధనలు విధించారు. భగవంతుడిని కూడా తమ పార్టీ లబ్ధికోసం వాడుకుంటున్నారు. ఎంత ఘోరం... "ఏడుకొండలవాడా వేంకటరమణా... ఇదేం రాజకీయం స్వామీ...!"

– రామిరెడ్డి వేణుగోపాలరెడ్డి, కావలి.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

# దడ పుట్టిస్తున్న వాహనాల దూకుడు!

నెల్లూరు నగరంలోని ప్రధాన రహదారులతో పాటు, చిన్న సందులలో కూడా నడవాలంటే దడ పుడుతోంది. నియంత్రణ లేని వాహనాల దూకుడు ఎక్కువైపోయింది. ముఖ్యంగా కుర్ర పిల్లకాయలు మోటారుసైకిళ్ల నడిపే విధానం చూస్తుంటే భయమేస్తోంది. వేగంగా నడపడమేకాకుండా, ఒక్కో బండిలో ముగ్గురు లేదా నలుగురు వెళ్తూ విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారు. ఆదివారాలు, సెలవు రోజులు వస్తే రేసులతో హడలెత్తిస్తున్నారు. మినీ బైపాస్, ఇస్కాన్ రోడ్డు, మాగుంట లే అవుట్, గొలగమూడి మార్గాలన్నీ ఈ రేసులకి ప్రధానమార్గాలుగా ఉంటున్నాయి. ఆటోడ్రైవర్ల ఆగడాలు కూడా ఎక్కువైపోతున్నాయి. ముగ్గురు లేదా నలుగురు ప్రయాణించవలసిన ఆటోలలో పదిమందికిపైగా ఎక్కిస్తున్నారు. డ్రైవర్‌కి అటు ఇటు ఇద్దరిద్దరిని కూర్చోబెట్టుకుని అత్యంత ప్రమాదకర రీతిలో ఆటోలు నడుపుతున్నారు. పోలీసువారు దూకుడుగా ప్రవర్తించే యువతతో పాటు, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆటోలపట్ల కూడా కఠినంగా వ్యవహరించి, గట్టి చర్యలు తీసుకోకుంటే ఘోరప్రమాదాలు జరిగే అవకాశంఉంది. చేతులు కాలాక ఆకులు పట్టుకోకుండా ముందే మేల్కొవాలని పోలీసుశాఖకి నా విజ్ఞప్తి.

– కాకి పెంచలనాయుడు, భక్తవత్సలనగర్.

సత్యపీఠం
నిజాలే మాట్లాడుకుందాం! 23

# ఎన్నికల సంఘం నిద్రపోతోందా?

ఇటీవల కాలంలో రాజకీయ నేతలు మాట్లాడుతున్న మాటలు, చేసుకుంటున్న సవాళ్ళు చూస్తుంటే ఆశ్చర్యమేస్తోంది. మనదేశంలో నియమాలు, నిబంధనలు లాంటివి ఉన్నాయా... లేవా? అన్న అనుమానం కలుగుతోంది. కొన్ని సందర్భాలలో చాలామంది నాయకులు నువ్వెంత ఖర్చు పెడితే నేను అంతకి రెట్టింపు పెడతా అంటూ ఒకరిపై ఒకరు ఛాలెంజ్ చేసుకుంటున్నారు. 'రాబోవు ఎన్నికలలో నువ్వు ఎంత ఖర్చు పెడితే, దానిపైన అధికంగా 50 కోట్లయినా నేను ఖర్చు పెడతా ...' అని ఓ ప్రజాప్రతినిధి, ప్రస్తుతం చట్ట సభలలో ప్రాతినిధ్యం వహిస్తున్న శాసనసభ్యుడే ఇటీవల తనపై పోటీ చేసే అభ్యర్థికి బహిరంగ సవాలు విసిరాడు. ఈ సవాళ్ళు, ప్రతి సవాళ్ళు వింటుంటే విడ్డూరంగా ఉంది. ఈ లెక్కన వాళ్ళు ఎంత ప్రజాధనాన్ని దోచుకున్నారో, ఏ స్థాయిలో అవినీతి సొమ్ముని, అక్రమ సంపాదనని వెనకేసుకుని మూటగట్టుకున్నారో అర్థమవుతుంది. ఈ నీతిమాలిన నాయకులేమైనా నాలుగు గోడల మధ్య ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారా అంటే అదీలేదు. సిగ్గు, లజ్జ, మానం, మర్యాదా వదిలేసి బహిరంగంగానే సవాళ్ళు విసురుకుంటున్నారు. మీడియా కెమెరాల్లో సైతం ఇవన్నీ రికార్డు అవుతున్నాయన్న జంకు కూడా లేదు. ప్రజలు తమని గమనిస్తున్నారన్న భయం అంతకంటే లేదు. ఓ వైపు తాము అత్యంత నీతిమంతులమంటూ తాము నమ్మిన దైవాల మీద ప్రమాణం చేస్తూనే, మరోవైపు ఎంతైనా ఖర్చుపెడతాం 'ఛాలెంజ్' అంటూ... తొడలు చరిచి మీసాలు మెలేస్తున్నారు. ఇలా మాట్లాడుతున్న వాళ్లపైన ఎన్నికల సంఘం దృష్టిపెట్టాలి. ఇలాంటి వాళ్లపైన సుమోటోగా కేసులుపెట్టాలి. అలా ఎందుకు పెట్టడంలేదో అర్థం కావడంలేదు. ఎన్నికలు జరిగిపోయిన సంవత్సరాల తరువాత దర్యాప్తులు, అధికారుల సస్పెన్షన్లు అంటూ హడావుడి చేస్తున్నారు. ఇలాంటి నాయకులపైన కూడా ఎలక్షన్ కమిషన్ అధికారులు కొరడా ఝుళిపించి వారిని ఎన్నికలలో పోటీ చేయడానికి అనర్హులుగా ప్రకటించాలి. ఒకరిద్దరిపై అలాంటి చర్యలు తీసుకుంటే మిగిలిన వారంతా కుక్కినపేనులైపోతారు.

ఓ వైపు నాయకులు ఇలా ఛాలెంజ్‌లు విసురుకుంటుంటే, మరోవైపు దేశంలోని కొన్ని రాష్ట్రాలలో అధికారంలో ఉన్న పార్టీలు ఉచిత తాయిలాల పేరుతో కొన్ని లక్షల కోట్లు ప్రజల ఖాతాలలో నేరుగా జమ చేస్తున్నారు. తమ ప్రాంత అభివృద్ధి కోసం ప్రజలు వివిధ రకాల పన్నుల రూపంలో ప్రభుత్వానికి చెల్లిస్తున్న కోట్ల రూపాయలను ఓట్ల రాజకీయాల కోసం వాడుకుంటున్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి పథకాల పేరుతో జనం సొమ్ముతో ఓట్లు కొనుక్కోవడానికి అధికారికంగానే ప్రభుత్వ సొమ్ముని ముట్ట చెప్తున్నారు. ఒక్క బటన్ నొక్కగానే లక్షల కోట్లు జనాల అకౌంట్లలోకి వెళ్లిపోతాయి. అంటే, చట్టపరమైన లంచం అన్నమాట. పైగా తాము ఇస్తున్న డబ్బుల గురించి డబ్బా కొట్టుకోవడానికి మళ్ళీ కోట్లరూపాయలు ఖర్చుపెట్టి పత్రికలలో, టీవీ ఛానెళ్లలో ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఒక విధంగా చెప్పాలంటే ఆ రేసులో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంది. ఇప్పుడు ప్రధాన ప్రతిపక్ష పార్టీలు కూడా అధికారపార్టీతో పోటీపడి మరి ఓటర్లకి ఉచిత తాయిలాల ఎర వేస్తున్నారు.

నాయకులు చేస్తున్న ఇలాంటి చట్ట విరుద్ధ ప్రకటనలని, ప్రభుత్వాలు తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాలని నియంత్రించడంలో ఎన్నికల సంఘం విఫలమవుతోందనే చెప్పాలి. ఎక్కడైనా, ఎపుడైనా ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో లేదా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తరువాత మాత్రమే ఎన్నికల సంఘం అప్రమత్తమవుతోంది. మిగిలిన సమయాల్లో ఓట్లను దృష్టిలో పెట్టుకుని నాయకులు చేస్తున్న అకృత్యాలను, ప్రభుత్వాలు చేస్తున్న అనవసర పంపకాలని నియంత్రించడంలో ఎన్నికల కమిషన్ ఉత్సవ విగ్రహం మాత్రమే అని చెప్పడానికి సంకోచం అవసరంలేదు.

ఎన్నికలు జరిగే ప్రతిసారీ ఓట్ల రాజకీయం అంతా నోట్ల చుట్టూనే తిరుగుతోంది. వందల కోట్లు పట్టుకున్నాం అని ఐటీ అధికారులు, పోలీసులు, ఎన్నికల సంఘం ప్రగల్భాలు పలికినా నిజానికి ఆ డబ్బు రాజకీయ నాయకులకి చెందిందై ఉండదు. ఖచ్చితంగా అది వ్యాపారస్తుల డబ్బే. ఎన్నికలలో డబ్బు పంపిణీ జరగకుండా అడ్డుకున్నాం అని వాళ్ళు (అధికారులు) బీరాలు పలికినా, ప్రజాక్షేత్రంలో పంపకం జరిగేది వేల కోట్లని, తాము కొండని తవ్వి ఎలుకని మాత్రమే పట్టుకున్నామని వాళ్ల మనస్సాక్షికి కూడా తెలుసు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత డబ్బు రవాణా చేయడానికి నేటి నేతలేం అమాయకులు కాదు. ఎన్నికలకి ఆరు నెలల ముందే ఎక్కడ చేరాల్సిన నోట్ల కట్టలు అక్కడికి చేరిపోయి ఉంటాయి. ఎన్నికల సంఘం నిజంగా అవినీతిని, నోట్ల రాజకీయాలని అడ్డుకోవాలంటే పనిచేయాల్సింది ఆ రెండు నెలలే కాదు, మిగతా రోజుల్లో కూడా నేతల మాటలపైనా, చేతలపైనా నిఘావుంచితే వ్యవస్థ కొంతైనా బాగుపడుతుందేమో.

ఎన్నికల సమయంలో క్షణ క్షణం నిఘానేత్రాలతో పర్యవేక్షిస్తూ పనిచేసే ఎలక్షన్ కమిషన్ అధికారులు మిగిలిన సమయంలో మూడు కోతుల సిద్ధాంతాన్ని పాటించి కళ్ళు, చెవులు, నోరు మూసేసుకుంటున్నారా ...? అన్న అనుమానం కలుగుతోంది!

– రాజశ్రీ

# 'మెడికవర్' ఆసుపత్రి వద్ద.. ఫ్లైఓవర్ నిర్మించండి

## కేంద్రమంత్రి గడ్కరీకి బీజేపీ నేతల వినతి



నెల్లూరు జాతీయ రహదారి ఎన్‌హెచ్-16లో చింతారెడ్డిపాళెం -మెడికవర్ ఆసుపత్రి వద్ద వాహనాల రాకపోక లకు వీలుగా అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఫిబ్రవరి1 గురు వారం ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి నెల్లూరు బీజేపీ నాయకులు పి.సురేంద్రరెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డిలు విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన కేంద్రమంత్రి ఆమేరకు సంబంధిత రీజనల్ కార్యాలయం అధికారులను ఆదేశించారంటూ వారు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని ఎన్‌హెచ్-6 జాతీయ రహదారిలో కోవూరు నుంచి నెల్లూరు కార్పొరేషన్‌లోని 17 కిలోమీటర్ల వరకు ఉన్న 4 లైన్ల రహదారిని 6 లైన్ల రహదారిగా మార్చాలని కూడా విజ్ఞప్తి చేయగా, ఆ విషయాన్ని తప్పకుండా పరిశీలిస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారని వారు తెలిపారు.



## 20వ డివిజన్‌లో

# మువ్వన్నెల జెండా రెపరెప

జనవరి 26న రిపబ్లిక్ డే సందర్భంగా నెల్లూరులోని 20వ డివిజన్ కొండాయ పాళెం మున్సిపల్‌స్కూల్‌లో హెడ్‌మాస్టర్ వెంకటేశ్వరరావు, 20వ డివిజన్ ఇన్‌ఛార్జ్ శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ ఛైర్మన్ రావు శ్రీనివాసరావు (ఆర్‌ఎస్‌ఆర్)ల ఆధ్వర్యంలో 75వ గణ తంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరి గాయి. నాయకులు తాళ్లూరి సురేష్ బాబు, దువ్వూరు భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా జాయింట్ సెక్రటరీ పెరుమాళ్ళ పద్మజా యాదవ్, జిల్లా మహిళా సెక్రెటరీ రమాదేవి, డివిజన్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

# అదాని కృష్ణపట్నంపోర్ట్‌లో.. రిపబ్లిక్ డే వేడుకలు



అదాని కృష్ణపట్నం పోర్టులో జనవరి 26న 75 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కృష్ణపట్నం పోర్ట్ సీఈవో జీజె రావు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్రోద్యమ నాటి వీరుల త్యాగాలను కొనియాడారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని అందరూ దేశాభి వృద్ధికి పాటుపడాలన్నారు. అదాని కృష్ణ పట్నం పోర్ట్ పరిసర ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని, అందులో భాగంగా మత్స్యకారులకు చేపల వేటకు అనువుగా నేలటూరు వద్ద రూ.20 కోట్లతో జెట్టి నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎగుమతి దిగుమతుల్లో పోర్టు అనేక రికార్డులను సాధించిందని, ప్రతిష్ఠాత్మకమైన 2023 గ్రీన్ టెక్ అవార్డును కూడా పొందడం సంతోషకరమని అన్నారు. ఈ సందర్భంగా, విధి నిర్వహణలో ప్రతిభ చూపిన వారికి ఆయన జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, జి.వేణుగోపాల్, మృత్యుంజయరామ్, వెంకటేష్ భాస్కరన్, రాజేష్ రంజన్, వివిధ విభాగాల హెచ్‌ఓడిలు పాల్గొన్నారు.



# ఉరకలెత్తించిన బాబు సభ

## • టీడీపీలో నూతనోత్తేజం

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జనవరి 28న నెల్లూరు పర్యటనకు రావడంతో టీడీపీలో నూతనోత్తేజం వచ్చింది. కార్య కర్తలు, అభిమానులు బాబు సభకు తండోపతండా లుగా తరలివచ్చారు. దీంతో నగరంలోని ఎస్‌విజిఎస్ ప్రాంగణం జనంతో క్రిక్కిరిసిపోయింది. కనుపర్తిపాడు వద్ద హెలికాప్టర్‌లో దిగిన బాబుకు నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. వేలసంఖ్యలో జనం చంద్రబాబును చూడడానికి వచ్చారు. సభా ప్రాంగణం కిటకిటలాడింది. మధ్యాహ్నం మండుటెండలోనూ ప్రజలు, అభిమానులు కదలకుండా చంద్రబాబు ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. మాజీమంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పొంగూరు నారాయణ, నాయకులు ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, బొల్లినేని వెంకటరామారావు, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాలేపాటి సుబ్బానాయుడు, కురు గొండ్ల రామకృష్ణ, ఇంటూరు నాగేశ్వరరావు, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, కంభం విజయరామిరెడ్డి, పనబాక కృష్ణయ్య, నెలవల సుబ్రహ్మణ్యం, పాశం సునీల్ కుమార్, కావ్య కృష్ణారెడ్డి, జనసేన మనుక్రాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### భస్మాసురుడు జగన్

తాను అర్జునుడినని, అభిమన్యుడినని జగన్ చెప్పుకుంటున్నాడు కానీ, వాస్తవానికి జగన్ భస్మా సురుడని, నమ్మి, ఓట్లు వేసిన జనం నెత్తిన చెయ్యిపెట్టి భస్మం చేస్తున్నాడని చంద్రబాబునాయుడు ఈ సం దర్భంగా దుయ్యబట్టారు. జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను రీ సర్వే పేరుతో వైకాపా నాయకులు దోచుకుంటున్నా రని, ఇలాంటి భస్మాసురుడిని ఓడించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఇప్పటికే వైకాపా తరఫున పోటీ చేసేందుకు అభ్యర్థులు భయపడిపోతున్నారని, తమ కుటుంబాన్ని బూతులు తిట్టేవారికే వైకాపాలో పదవులు, ప్రమోషన్లు ఇస్తున్నారని, ఇంత దారుణమైన పార్టీని తామెక్కడా చూడలేదని బాబు పేర్కొన్నారు. జనం అంతా తెలుసుకున్నారని, జగన్ చెప్పే మాయ మాటలను ఇక నమ్మరని, ఇంకొద్ది రోజుల్లోనే వైకాపా కనుమరుగైపోతుందని అన్నారు. దోచుకోవడం, దాచుకోవడం తప్ప జగన్‌కు మరో ఆలోచన లేదన్నారు. వైకాపా నాయకులు ప్రకృతి సంపదనంతా అడ్డగో లుగా ఊడ్చేస్తున్నారని, రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుక బడిపోయిందని, రానున్న ఎన్నికల్లో వైకాపాను చిత్తుగా ఓడించి, తెలుగుదేశం-జనసేన పార్టీకి ఘనవిజయం చేకూర్చాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

### అమరావతి రైతుల గోడు తగలక తప్పదు

రైతులు గిట్టుబాటు ధరలు లేక అల్లాడుతున్నా వైకాపా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, దీంతో రైతాంగం పరిస్థితి అయోమయంలో ఉందని, వ్యవసాయ మంత్రి కాకాణికి కాణీ లేనిదే నిద్రపట్టదని చంద్రబాబునాయుడు ఈ సభలో విమర్శలు చేశారు. అమరావతి రాజధానిగా చేస్తామని తాము చెప్తే, దానినిప్పుడు కక్షతో జగన్ నాశనం చేసేశారని, జగన్‌కు అమరావతి రైతుల గోడు తగలక తప్పదని ఆయన శాపనార్థాలు పెట్టారు. రాష్ట్ర ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన జగన్, పాలిం చడం చేతకాక 12 లక్షల కోట్లు అప్పులు తెచ్చి, రాష్ట్రాన్ని అప్పులపాలు చేశాడని, రాష్ట్ర ప్రజానీకంపై మోయలేని అప్పులభారాన్ని మోపాడని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రజలు తమను ఆశీర్వదించి గెలిపిస్తే, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ దుస్థితినంతా సరిదిద్ది రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని, నెల్లూరుజిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులన్నీ తప్పనిసరిగా చేస్తామని చంద్రబాబు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## • కాంగ్రెస్‌లో కొత్త ఉత్సాహం

# హోరెత్తిన షర్మిల పర్యటన





కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలయ్యాక తొలి సారిగా షర్మిల జనవరి 27న నెల్లూరు పర్యటనకు రావడంతో కాంగ్రెస్‌లో కొత్త ఉత్సాహం ఉరకలు వేసింది. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెల్లెలు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిల నగరానికి రావడంతో ఆమెను చూడడానికి జనం పోటీలు పడ్డారు. నగరంలోని పలు ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి, ఆమెకు స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. భారీగా కార్ల ర్యాలీ నిర్వహిం చారు. ఇటీవల దాకా స్తబ్దుగా ఉన్న ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు క్రిక్కిరిసిపోయారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు షర్మిలకు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పీసీసీ మాజీ ఛీఫ్ గిడుగు రుద్రరాజు, డిసిసి అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి, ఉదయగిరి కాంగ్రెస్ నాయకుడు సోము అనిల్‌కుమార్‌రెడ్డిలను షర్మిలమ్మ ప్రత్యేకంగా అభినందించారు. షర్మిలమ్మ రాకతో కాంగ్రెస్ తప్ప కుండా తిరిగి బలోపేతం అవుతుందని ఈ సంద ర్భంగా కార్యకర్తలు, నాయకులు తమ అశాభావం వ్యక్తం చేశారు.

### షర్మిల.. బెదిరిస్తే బెదిరేది కాదు

తాను నెల్లూరుకు వస్తున్నానంటే వైకాపా వారిలో వణుకు మొదలైంది. వైకాపా గూండాలు తమ ఫ్లెక్సీలు తొలగించాలని చూశారని, అయితే తామెవరికీ భయ పడేది లేదని స్పష్టం చేశారు. షర్మిల..బెదిరిస్తే బెదిరేది కాదని, తనలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రక్తం ప్రవహి స్తోందని' ఆమె ఆవేశంతో చెప్పారు. కాంగ్రెస్‌తోనే రాష్ట్రానికి అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఒక్కో కార్యకర్త సైన్యంగా మారి కదలాలని, ఉద్యమాలకు పుట్టినిల్లయిన నెల్లూరుసీమలో తిరిగి పార్టీని బలోపేతం చేసి కాంగ్రెస్‌కు విజయం చేకూర్చాలని ఆమె చెప్పారు. 'ప్రజలారా మేలుకోండి!.. మన తలరాతల్ని మార్చుకునే నిర్ణయం చేసుకోలేకపోతే చరిత్రహీనులుగా మిగిలిపోతాం' అని ఆమె ప్రజల నుద్దేశించి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు, గతంలో నెల్లూరుజిల్లా కలెక్టర్‌గా పనిచేసిన కె.రాజు, సీడబ్ల్యుసి సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ళ రామ కృష్ణారెడ్డి, నాయకులు జేడీ శీలం, పల్లం రాజు, గిడుగు రుద్రరాజు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి, మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### రాష్ట్రానికి 'ప్రత్యేక హోదా' ఏది.. జగనన్నా!

'రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఏది జగనన్నా?' అంటూ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు, ముఖ్యమంత్రి జగన్ సోదరి షర్మిల సూటిగా ప్రశ్నించారు. 'అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేకహోదా తెస్తానన్నారు.. కానీ ఇప్పటిదాకా ఆ ఊసే లేదు. రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ అయిదేళ్లపాటు ఆ హోదా ఇస్తానంటే, తాము పదేళ్ళు ఇస్తామని అప్పట్లో బీజేపీ నేతలు ప్రకటించారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక బీజేపీకి బానిసగామారి ప్రత్యేకహోదా గురించి నోరు మెదపడం లేదు'.. అని ఆమె ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో తనదైన శైలిలో దుయ్య బట్టారు. అధికారం చేపట్టాక ముఖ్యమంత్రి జగన్ మహానేత డా. వైఎస్ ఆశయాలకు తూట్లు పొడి చారని, పోలవరం ప్రాజెక్టు గురించి అంటు చంద్ర బాబు కానీ, ఇటు జగన్‌మోహన్‌రెడ్డి కానీ పట్టించు కోలేదని విమర్శించారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయితే రాష్ట్రానికి ప్రత్యేకహోదాపై తొలి సంతకం చేస్తారని ఆమె చెప్పగానే సభికులు పెద్దఎత్తున హర్షధ్వానాలు చేశారు.

# వైకాపా ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే



భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజునే గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నామని, ఇది మన మహనీయుల త్యాగఫలమని, దేశ ప్రజల స్వేచ్ఛ, సమానత్వానికి పెద్దపీట వేస్తూ ఎందరో మేధావులు భారత రాజ్యాంగాన్ని రూపొందించారని రాజ్యసభ సభ్యులు, జిల్లా వైకపా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని వైకాపా జిల్లా కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ పొట్లూరి స్రవంతి తదితరులతో కలసి ఆయన జాతీయపతాకాన్ని ఎగురవేసి వందనం చేశారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ మాజీ ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షులు సుధీర్‌కుమార్‌రెడ్డి, డీసీసీబీ ఛైర్మెన్ సత్యనారాయణ రెడ్డి, ఏఎంసీ ఛైర్మెన్ పేర్నాటి కోటేశ్వరరెడ్డి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మొయిళ్ళ గౌరి, డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు పెన్సిల్, పెన్, జామెట్రీ బాక్సులు అందజేశారు.

# విఆర్ ఎస్‌ఐలు.. విధుల్లోకి

జిల్లాలో విఆర్ (వ్యాకెన్సీ రిజర్వ్)లో ఉన్న 30 మంది ఎస్‌ఐలకు పోస్టింగ్‌లు ఇస్తూ జిల్లా ఎస్పీ కె.తిరుమలేశ్వరరెడ్డి ఇటీవల ఉత్తర్వులిచ్చారు. విఆర్‌లో ఉన్న ఎం.శివనాంచారయ్యను కృష్ణపట్నం పోర్టుకు, షేక్ రహంతుల్లాను సిసిఎస్‌కు, డి.రామకృష్ణను పొదలకూరుకు, జి.కిరణ్‌బాబును సంతపేటకు టి. భవానిని వేదాయపాళెంకు, జి.ఏడుకొండలను సిసిఎస్‌కు, ఎస్.నరహరిని దర్గామిట్టకు, డి.కిశోర్‌బాబు నార్త్ ట్రాఫిక్‌కు, వి.సుబ్బారావును నెల్లూరురూరల్‌కు, ఎం.రాజాను విడవలూరుకు, సిహెచ్ చంద్రావతిని నవాబుపేటకు, జి.అరుణజ్యోతిని దర్గామిట్టకు, ఎం.కోటేశ్వరరావును పీసీఆర్‌కు, టి.వెంకటరావును కందుకూరుకు, పి.వెంకటేశ్వర్లును సిసిఎస్‌కు, పి.సుబ్బారావును సిసిఎస్‌కు, టి. పెంచలయ్యను సిసిఎస్‌కు, ఎం.జోజిని నవాబుపేటకు, విఆర్‌కె మూర్తిని డిసిఆర్‌బికి, బి.మధుసూదనరావును డిసిఆర్‌బికి, బి.మాణిక్యరావును సిసిఎస్‌కు, ఎం.శ్రీనివాసులును కావలి టూటౌన్‌కు, వి.భాస్కర్‌రావును ఆత్మకూరుకు, పి.జనార్ధన్‌రావును డీటీసీకి, కె.నాగేశ్వరరావును సంతపేటకు, వి.రాంబాబును ఉదయగిరికి, ఐ.రమాదేవిని సిసిఎస్‌కు, కె.వెంకటనరసరాజును రాపూరుకు, డిఎస్ విజయకుమార్‌ను సైదాపురంకు ఎస్‌ఐలుగా నియమించారు. అదేవిధంగా, బుచ్చిరెడ్డిపాళెం ఎస్‌ఐ బి.మహేంద్రను సిసిఎస్‌కు, దర్గామిట్ట ఎస్‌ఐలు బి.రమేష్‌బాబు, డి.సుబ్రహ్మణ్యంలను డీటీసీకి బదిలీ చేశారు.

## నెల్లూరు కబుర్లు

### కన్నులపండువగా..

# శ్రీ రంగనాథుని కల్యాణోత్సవం



నెల్లూరు రంగనాయకులపేటలో కొలువైవున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి కల్యాణోత్సవం జనవరి 28న కన్నుల పండువగా జరిగింది. ధర్మ ప్రచార వారోత్సవాల ముగింపు సందర్భంగా ఈ వేడుక నిర్వహించారు. అదేరోజు ఉదయం తిరుమలిశై ఆళ్వారు జయంతిని పురస్కరించుకుని స్వామి వారికి, అమ్మవార్లకు తిరుమంజనం నిర్వహించారు. అనంతరం పేట ఉత్సవం వేడుకగా జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఆలయ ఛైర్మెన్ మంచికంటి శ్రీనివాసులు, ఇఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

# సర్పంచ్‌ల సంఘం దీక్షలు



వైకాపా పాలనలో స్థానిక సంస్థలను నిర్వీర్యం చేశారంటూ జిల్లాలోని అనేకమంది సర్పంచ్‌లు రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం, రాష్ట్ర పంచాయతిరాజ్ చాంబర్ ఆధ్వర్యంలో జనవరి 30న నెల్లూరు గాంధీబొమ్మ వద్ద దీక్షలు చేపట్టారు. ఆ సంఘం నాయకులు దేవిరెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, శివకుమార్‌లు మాట్లాడుతూ, జగన్ ముఖ్యమంత్రి అయ్యాక కేంద్రప్రభుత్వం గ్రామ పంచాయతీలకు విడుదల చేసిన కోట్లాదిరూపాయల నిధులను పక్కదారి మళ్ళించారని, ఇకనైనా పంచాయతీలకు చట్టబద్ధంగా రావాల్సిన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌ల దీక్షలకు టీడీపీ నాయకులు అబ్దుల్ అజీజ్, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, జనసేన నాయకులు మద్దతు తెలిపారు.



# 'విపిఆర్ విద్య'లో.. గణతంత్ర దినోత్సవం

నెల్లూరు సమీపంలోని కనుపర్తిపాడు వద్ద విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'విపిఆర్ విద్య' పాఠశాలలో జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాజ్యసభ సభ్యులు, జిల్లా వైకాపా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి.. టీటీడీ ఉత్తరభారతదేశ ఆలయాల స్థానిక సలహామండలి(న్యూ ఢిల్లీ) అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈ వేడుకల్లో పాల్గొని జాతీయపతాకాన్ని ఎగురవేసి గౌరవవందనం చేశారు. అనంతరం, విద్యార్థులందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు పలు భాషల్లో దేశం గొప్పతనాన్ని చాటేవిధంగా మాట్లాడి అందరి అభినందనలు అందుకున్నారు.

# కలెక్టరేట్ ఎదుట బీటీఏ ఆందోళన




ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ బీటీఏ నేతలు జనవరి 30న నెల్లూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వ తీరుతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎన్నో బాధలుపడుతున్నారని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆందోళనలో ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పల్లం వేణుగోపాల్, కోశాధికారి ఆదినారాయణ మాట్లాడుతూ, సమస్యల సాధన కోసం మూడు దశల పోరాటాన్ని నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి 5న విజయవాడలో మహాధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ ఆందోళనలో బీటీఏ వ్యవస్థాపకుడు పి.లక్ష్మయ్య, కార్యదర్శులు బ్రహ్మయ్య, రఘు, తిరుపతయ్య, జిల్లా అధ్యక్షుడు మణిసుబ్బు, కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 'తంగిరాల మహాభారతం'

## 90వ భాగం

అర్జునుని అత్యంత పరాక్రమ శక్తికి ఆనందపడి పరమేశ్వరుడు అతనికి దివ్యదృష్టి నొసంగి తన నిజస్వరూపాన్ని సాక్షాత్కరిస్తాడు. అర్జునుడు తన్మయత్వంతో శివ దండక స్తోత్రం చేస్తాడు. పరమశివుడు సంతోషించి అర్జునునికి తాను మాయం చేసిన అతని ఆయుధాలను తిరిగి ఇచ్చేస్తాడు.

అర్జునుని కోరిక మేరకు, అతనికి పాశుపతాస్త్రాన్ని అనుగ్రహిస్తాడు.




అలాగే దేవేంద్రుడు, యముడు, వరుణుడు, కుబేరుడు ప్రత్యక్షమై అస్త్రాయుధాలని ప్రసాదిస్తారు. దేవేంద్రుని ఆహ్వానం మేరకు అర్జునుడు దేవేంద్రుడు పంపిన రథం మీద అమరావతికి వేంచేస్తాడు.

దేవేంద్రుడు అర్జునుడిని ఆదరంగా తన సింహాసనం మీద కూర్చోబెట్టుకుంటాడు. అర్జునునికి మంచి వసతి ఏర్పాటు చేసి అతని సపర్యల కోసం ఊర్వశిని నియమిస్తాడు.

**భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.**

**పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.**






### రైతన్నల కష్టాలకు

# కవితా రూపం.. 'మట్టిబండి'



ప్రముఖ కవి నాగభైరవ ఆదినారాయణ రచించిన 'మట్టిబండి' దీర్ఘకవిత నేటి సమాజంలోని వాస్తవాలకు ప్రతిరూపమని పలువురు వక్తలు ప్రశంసించారు. నెల్లూరులోని టౌన్‌హాలు రీడింగ్‌రూమ్‌లో జనవరి 28న 'మట్టిబండి' దీర్ఘకవిత పరిచయ కార్యక్రమం జరిగింది. సుప్రసిద్ధ కవి చిన్ని నారాయణరావు సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు గంగిశెట్టి శివకుమార్, బీరం సుందరరావు పాల్గొని ఆ పుస్తకాన్ని సమీక్షించారు. రైతుల జీవన పరిస్థితులను బాగా అధ్యయనం చేసి, వారి కష్టాలను కవిత్వంగా మలచి ఈ దీర్ఘకవితను రచించారని, వాస్తవాలను కళ్ళకు కట్టినట్లు కవిత్వీకరించారని వారు కొనియాడారు. అనంతరం చిన్ని నారాయణరావు, విజిలెన్స్ డీఎస్పీ కొల్లూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొని ఆదినారాయణను ఘనంగా సన్మానించారు. తొలుత జరిగిన కవి సమ్మేళనం అందరినీ ఆకట్టుకుంది. సాహితీవేత్తలు మెట్టు రామచంద్రప్రసాద్, మోపూరు పెంచలనరసింహం, పెరసం అధ్యక్షుడు అవ్వారు శ్రీధరబాబు, కవయిత్రులు గోవిందరాజు సుభద్రాదేవి, తోట సులోచన తదితరులు పాల్గొన్నారు.

## అరాచకాలు చేసేవారా?..

# అభివృద్ధి చేసేవారా?..

### ఎవరు కావాలో.. ప్రజలే ఆలోచించుకోవాలి - ఎంపీ ఆదాల



అరాచకాలు, అవినీతి, దౌర్జన్యాలు చేసేవారు కావాలో.. ప్రజలందరికీ మేలు చేస్తూ, సంక్షేమ ఫలాలు అందిస్తూ సుపరిపాలనతో అభివృద్ధే లక్ష్యంగా పనిచేసేవారు కావాలో ప్రజలు ఆలోచించుకోవాలని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 20వ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ కొండాయపాళెంలో పలు అభివృద్ధి నిర్మాణ పనులకు ఆదాల ఇటీవల శంకుస్థాపన చేశారు. 20వ డివిజన్ ఇన్‌చార్జి తాళ్లూరు సురేష్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ప్రస్తుతం అశాంతి, అరాచకాలు, దౌర్జన్యాలు లేకుండా పోయాయని, ప్రశాంత వాతావరణంలో పరిపాలన సాగుతున్న విషయాన్ని ప్రజలు గమనించాలని, రానున్న ఎన్నికల్లో వైకాపాను గెలిపించాలని ఆయన కోరారు. డివిజన్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రూ. 45 లక్షలతో నాలుగు సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతోందని, ప్రభుత్వ సహకారంతో ఇప్పటివరకు ఒక్క 20వ డివిజన్‌లోనే సుమారు రూ 8.80 కోట్లతో వివిధ అభివృద్ధిపనులు చేశామని చెప్పారు. నగర మేయర్ పోట్లూరు స్రవంతి, డీసీసీబీ మాజీ ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఏఎంసీ ఛైర్మెన్ పేర్నాటి కోటేశ్వర్‌రెడ్డి, రైల్వే బోర్డు సభ్యులు స్వర్ణ వెంకయ్య, కార్పొరేటర్లు మూలే విజయభాస్కర్‌రెడ్డి, ఒరిస్సా శ్రీనివాసులురెడ్డి, బొబ్బల శ్రీనివాస్ యాదవ్, 20వ డివిజన్ ఇన్చార్జి, శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఛైర్మెన్ రావు శ్రీనివాసరావు(ఆర్ఎస్ఆర్), జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు పాలకీర్తి రవికుమార్, ఏఎంసి వైస్ చైర్మన్ ఒట్టూరు సుధాకర్‌యాదవ్, దువ్వూరు భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, మహిళా నాయకురాలు మొయిళ్ళ గౌరి తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు చెరువులో.. 5 లక్షల చేపపిల్లలు విడుదల

మత్స్యకారుల జీవనోపాధి కోసం నెల్లూరులోని స్వర్ణాల చెరువులో జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఇటీవల ఐదు లక్షల చేపపిల్లల విడుదల చేశారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ వైకాపా ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. గిరిజన మత్స్యకారుల జీవనోపాధి విషయంలో ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మాట తప్పని ముఖ్యమంత్రి..జగన్

### నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా వెంకటగిరిలోని చెవిరెడ్డిపల్లి గ్రామంలో ఇటీవల టిడ్కో ఇళ్లను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్, వెంకటగిరి వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొని టిడ్కో ఇళ్ళకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం ప్రజలకు ఇచ్చిన మాట తప్పరని ప్రశంసించారు. చెప్పిన మాట ప్రకారం ముఖ్యమంత్రి లబ్దిదారులకు టిడ్కో ఇళ్లను కేటాయించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రామ్‌తో పాటు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వెంకటగిరి రాజా సాయికృష్ణ యాచేంద్ర తదితరులు పాల్గొన్నారు. తొలుత, దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# జగన్ పాలనలోనే.. పేదల జీవితాలకు వెలుగులు

### ○ కొనియాడిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని, అనేక రకాల సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు తీసుకువస్తూ ప్రజల ఆదరాభిమానాలు పొందుతున్నారని, జగన్ పాలనలోనే పేదలకు సంక్షేమం ఉంటుందని నెల్లూరు ఎంపీ అభ్యర్థి, రాజ్యసభ సభ్యులు, వైకాపా జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) చెప్పారు. ఇటీవల ఆయన కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరులో ప్రజలకు నూతన ఆరోగ్యశ్రీ కార్డులు, భూహక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం జగన్ రెవెన్యూ వ్యవస్థలో అనేక సంస్కరణలు చేపట్టారని, వందల ఏళ్లనాటి పాత భూ చట్టాలను సరిచేశారని, ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న చుక్కల భూముల సమస్యలను పరిష్కరించారని, అసైన్డ్ భూముల లబ్ధిదారులకు పూర్తి హక్కులు కల్పించారని తెలిపారు. కొత్తగా రీసర్వే చేపట్టి గ్రామాల్లో భూముల తగాదాలు లేకుండా చూస్తున్నారని, లబ్దిదారులు ఇప్పుడు భూమిపై భూహక్కు పత్రాలు అందుకుంటున్నారంటే అది ముఖ్యమంత్రి జగన్ వల్లే సాధ్యమైందని ఆయన కొనియాడారు. ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకాన్ని విస్తరిస్తూ, ఆ సాయాన్ని 5 లక్షల నుంచి 25 లక్షల రూపాయలకు పెంచడం దేశ చరిత్రలోనే ప్రథమమన్నారు. ఎంతోమంది పేదల జీవితాల్లో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ఆశాకిరణంగా మారిందని చెప్పారు. పేదల కోసం ఆలోచించే... ఇలాంటి ప్రభుత్వం మన దేశంలోనే లేదని అన్నారు. సీఎం జగన్ ద్వారా లబ్దిపొందిన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రికి అండగా నిలవాలని ఈ సందర్భంగా విపిఆర్ విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో కోవూరు నియోజకవర్గ శాసనసభ్యునిగా మళ్ళీ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డినే ఎన్నుకోవాలని, అలాంటి ఎమ్మెల్యే ఉంటేనే మరింత అభివృద్ధి సాధ్యమని అన్నారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా తాను పోటీ చేస్తున్నానని, ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం లబ్ధిదారులకు భూహక్కు పాసు పుస్తకాలు, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎల్డీఏ ఛైర్మెన్ విజయకుమార్, మండల కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జీవితం.. స్ఫూర్తిదాయకం!

### శ్రీసిటీ శ్రీవాణి, పద్మావతి యూనివర్శిటీ ఆధ్వర్యంలో సాహిత్య-సంగీత స్వరాంజలి



'కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరుని భక్తురాలు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ తన జీవితాన్ని వెంకటేశ్వరస్వామికి అంకితం చేసిందని, ఆమె ఔత్సాహిక కవులకు స్ఫూర్తిదాయకంగా, తన మనోహరమైన భక్తిమయ రచనలు చిరస్థాయిగా కొలువుండేలా భక్తుల హృదయాలలో ఆమె సుస్థిరస్థానం పొందిందని' వక్తలు కొనియాడారు. శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక 'శ్రీవాణి', శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఇటీవల తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆవరణలో నిర్వహించిన తరిగొండ వెంగమాంబ భక్తి సాహిత్య స్వరాంజలి కార్యక్రమం అందరినీ అలరించింది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఎస్వీబీసీ ఛానల్ ఛైర్మెన్ డా. సాయికృష్ణ యాచేంద్ర, టీటీడీ 'శ్వేత' మాజీ డైరెక్టర్ భూమన్, శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య భూమన కుసుమకుమారి, శ్రీ పద్మావతి మహిళా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దేవూరి భారతి, కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కొలకలూరి మధుజ్యోతి, వెంగమాంబ జీవితం-రచనలపై పరిశోధక గ్రంథం రచించిన గంధం శంకరరావు ముఖ్య అతిథులుగా పాల్గొని వెంగమాంబ జీవిత విశేషాలను వెల్లడించారు. తొలుత, వారికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికి, శ్రీవాణి ద్వారా ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపడుతుండడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ భారతి మాట్లాడుతూ, మహిళా విశ్వవిద్యాలయంలో ఓ అద్భుతమైన మహిళా కవయిత్రి గురించి కార్యక్రమం నిర్వహించడం ఇక్కడి మహిళా విద్యార్థినులకు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ద్రవిడ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కొలకలూరి మధు జ్యోతి వెంగమాంబ జీవిత చరిత్రలోని ముఖ్య ఘట్టాలను విశదీకరించారు. భూమన్ వెంగమాంబ జీవితం, రచనల విశిష్టతను విపులీకరించారు. ప్రముఖ విద్వాంసులు, శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ఛైర్మెన్ డాక్టర్ సాయికృష్ణ యాచేంద్ర నేతృత్వంలో వెంగమాంబకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంగమాంబ రచనల స్వరకల్పన కార్యక్రమం ప్రేక్షకులను తన్మయులను చేసింది. అనంతరం, గంధం శంకరరావు వెంగమాంబ కీర్తనలపై స్వరకల్పన చేసిన కొన్ని పాటలకు విశ్లేషణలు అందించగా, యువ గాయకులు మల్లాది అనూష, సుష్మ, పవిత్ర, శివ శ్రవణ్, నరేష్ వాటిని ఆలపించారు. వీరికి వాద్య కళాకారులు బాబు (కీబోర్డు), వెంకట్రావు(తబలా), నటరాజ్ (ఫ్లూట్), చిల్లర సుబ్రమణ్యం(తాళం), శంకర్రావు(వ్యాఖ్యాత) సహకారాన్ని అందించారు. మహిళా విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఇన్‌చార్జి డాక్టర్ సుభాషిణి, శ్రీసిటీ పీఆర్ఓ పాలేటి బాలాజీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, పీఆర్ఓ రవీంద్రనాథ్ వందన సమర్పణ చేశారు.



# శ్రీసిటీలో గణతంత్ర వేడుకలు



శ్రీసిటీలో జనవరి 26న 75వ గణతంత్ర దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. శ్రీసిటీ బిజినెస్ సెంటర్ వద్ద గౌరవ అతిథి విశ్రాంత జిల్లా జడ్జి ఎంఆర్ శరవణకుమార్ పాల్గొని మువ్వన్నెల జాతీయ జెండాను ఎగురవేసి, శ్రీసిటీ సెక్యూరిటీ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను స్మరించుకోవడంతోపాటు, ప్రతి ఒక్కరు రాజ్యాంగ సూత్రాలకు కట్టుబడి మెలగాలని పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడు రాజ్యాంగ హక్కులు, బాధ్యతల పట్ల స్పృహతో ఉండాలని సూచించారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో శ్రీసిటీ భాగస్వాములందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ అభివృద్ధి నినాదాలైన 'ఆత్మనిర్భరత వ్యూహాన్ని' సమర్థిస్తూ, 'మేక్ ఇన్ ఇండియా' ఆశయాన్ని స్వీకరించి, 'నారీశక్తి' (మహిళా సాధికారత) ఉద్యమాన్ని స్వాగతించాలని ఆయన ఆకాంక్షించారు. శ్రీసిటీ డీఎస్పీ జగదీశ్‌నాయక్, సెక్యూరిటీ హెడ్ రమేష్, సెక్యూరిటీ సిబ్బంది కవాతును పర్యవేక్షించారు. అనంతరం, పలువురు సెక్యూరిటీ గార్డులకు ముఖ్యఅతిథి చేతుల మీదుగా నగదు పురస్కారాలు, సర్టిఫికెట్‌లను అందజేశారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సంబరాల్లో భాగంగా కోలాట నృత్యాలు, పిల్లల కర్రసాము ప్రదర్శన ఎంతగానో అలరించాయి.

# విభజన హామీల అమలుకు దీక్ష

కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి ప్రకటించిన విభజన హామీలను ఇంకా ఎప్పుడు అమలుచేస్తారని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) జిల్లా కన్వీనర్ షేక్ మున్నా ప్రశ్నిస్తూ, జనవరి 30న నెల్లూరు గాంధీబొమ్మ వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విశాఖపట్నం కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని, పోలవరం ప్రాజెక్టుకు వెంటనే నిధులు కేటాయించి సత్వరం పూర్తిచేయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సయ్యద్ సిరాజ్, కిశోర్, రైతు సంఘం నాయకుడు షేక్ షానవాజ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మస్తాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## విజేత



మాటకు పట్టాభిషేకం చేసి
మాటను మంత్రించి పదునెక్కించిన ధీరుడు
ఉపన్యాస విన్యాస శేముషీ దురంధరుడు
ఇంద్రధనుస్సు సోయగాల్ని
'పల్లె'కు తెచ్చిన అపర భగీరధుడు
గ్రామీణ వికాసానికి, సమాజాభ్యుదయానికి
వసంతఋతువుల్ని ఏర్చికూర్చిన తాపసి
వికసితవదనం, విలక్షణ సేవాపరత్వాలకు
నిలువెత్తు కేతనమై నిలచిన మహర్షి
స్థితప్రజ్ఞతా సంకేతమై వినుతికెక్కిన యోధుడు
తానొక ప్రజల బాధలు పంచుకొనే ఊరై
జనత కన్నీరు తుడిచే నిండుగపారే సెలయేరై
చీకటి పుట్టల్ని సవాలుచేసే దీపికయై
జనం గుండెల్లో ఆర్తికి కోటల దుర్గంగా
నిర్మించిన రేడు
సమున్నత పదవులనధిరోహించినా
అలంకారాలు పొడసూపని అద్వితీయుడు
ఆహార్యంలో ఉదయపు నీరెండలా
పల్లె సొగసులు అద్దిన నేర్పరి
సంభాషణా చాతుర్యానికి మధ్యాహ్న మార్తాండుడై
గెలిచిన ప్రవాహఝరి
మాటల విలుకాడై ప్రజాహృదయ చెలికాడై
విజ్ఞుడై.. విజేతయై... నింగికెగసిన కెరటమై
పద్మవిభూషణుడై తెలుగు కీర్తికిరీటమై
భాసిల్లిన మొనగాడు
ఇంకెవరు... ఇంకెవరున్నారు..
మన ముప్పవరపు వంశాంకురం!
సింహపురి సింహం.. మనందరిగర్వం
పదహారణాల తెలుగు తేజమే కదా!



- చిన్ని నారాయణరావు
9440202942

# ఎన్‌బికెఆర్‌లో అధ్యాపకులకు 'వాద్వాని ఫౌండేషన్' శిక్షణ




కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల వాద్వానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "ఎంప్లాయ బిలిటీ స్కిల్స్" అనే అంశంపై అధ్యాపకులకు మూడు రోజుల శిక్షణ సదస్సు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ్ కుమార్‌రెడ్డి ఈ సదస్సును ప్రారంభించారు. ఈ శిక్షణకు 60 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. వాద్వానీ ఫౌండేషన్ తరపున మాస్టర్ ట్రైనర్ స్వాతి పుత్రన్ ఈ సదస్సులో పాల్గొని మాట్లాడారు. అమెరికాలోని భారత సంతతికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ రమేష్ వాద్వానీ ఈ ఫౌండేషన్‌ను నెలకొల్పారని, దీని ద్వారా ఆఫ్రికా, ఏషియా మరియు లాటిన్ అమెరికాల్లోని వివిధ దేశాల్లో ఎంట్ర ప్రెన్యూర్, ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్, ఎంప్లాయబిలిటీ స్కిల్స్ వంటి తదితర అంశాల్లో ఉపాధ్యాయులకు మరియు విద్యార్థు లకు నిరంతర శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు 1000 విద్యాసంస్థల్లో సుమారు లక్షా 50వేల మంది విద్యార్థులకు, 5వేల మంది ఉపాధ్యాయులకు ఈ శిక్షణ నిర్వ హించడం జరిగిందని తెలియజేశారు. గత రెండు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులకు ఉపాధి అవకాశాలను వేగవంతం చేయడం, తద్వారా వారు గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి కావలసిన మెలకువ లపై ఈ ఫౌండేషన్ ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతోందని తెలియజేశారు. శిక్షణ పూర్తిచేసిన అధ్యాపకులకు గ్లోబల్ సర్టిఫికేషన్ అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌బికెఆర్ మెకానికల్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎస్ ఇందుమతి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

### ఉత్తమ ఎలక్ట్రోరల్ ఆఫీసర్‌గా

# గూడూరు ఆర్డీవో కిరణ్




తిరుపతి, కచ్చిపి కళాక్షేత్రంలో 14వ ఓటరు దినోత్సవ వేడుకలు రిపబ్లిక్ డే రోజున జరిగాయి. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి చేతులమీదుగా గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ ఉత్తమ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ అవార్డు అందుకున్నారు. విధి నిర్వహణలో అహర్నిశలు శ్రమిస్తున్న ఆర్డీవోకు ఈ అవార్డు ఇచ్చినట్లు కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

### లిటిల్ ఏంజల్ పబ్లిక్ స్కూల్‌లో

# వేడుకగా 39వ వార్షికోత్సవ సంబరాలు



గూడూరు శారదానగర్, చిల్లకూరులో ఉన్న లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూల్ 39వ వార్షికోత్సవం జనవరి 28న కరస్పాండెంట్ బుసరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ, విద్యార్థులు ఇంటర్నెట్‌లో లభించే డిజిటల్ విషయాల ద్వారా స్వతహాగా జ్ఞానాన్ని సంపాదించుకోవాలని, తద్వారా మంచి ఉపాధి అవకా శాలు సంపాదించుకోవాలని, పాఠశాలలో విద్యార్థులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ దిశగా కర స్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి ప్రోత్సాహం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ బి.శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నమశివాయ, హెడ్‌మాస్టర్ సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మను ఇటీవల ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గూడూరు మునిసిపాలిటీ నూతన కమిషనర్ వెంకటేశ్వర్లు

### మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్‌లకు

# ఉత్తమ ప్రశంసా పత్రం



75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ వారికి ఉత్తమ ప్రశంసాపత్రం లభించింది. గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ చేతులమీదుగా మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి ఈ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

# తెదేపాతోనే మహిళాభ్యున్నతి



మహిళాభివృద్ధి తెలుగుదేశంపార్టీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. గూడూరు పట్టణం, అంబేద్కర్‌నగర్‌లో 'భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమాన్ని జనవరి 30వతేదీ నిర్వహించారు. లీలావతి, శ్రావణ్, శ్రీదేవి, కల్పన, భారతి తదితరులు పాల్గొన్నారు.

# కొండూరుకు కళావేదిక సన్మానం

విందూరు ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, రచయిత కొండూరు వెంకటేశ్వరరాజు రెండు దశాబ్దాలుగా చేస్తున్న సాహిత్య సేవలకు గాను శ్రీశ్రీ కళావేదిక సన్మానం అందుకున్నారు. ఇటీవల ఎస్వీ యూనివర్శిటీ సెనేట్ హాల్లో నిర్వహించిన కవి సమ్మేళనంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ ఆచార్య భూమన సుగుణ చేతులమీదుగా ఈ సత్కారం అందుకున్నారు.

# శ్రీసిటీ-సిద్ధార్థ లాజిస్టిక్స్‌కు మరో అవార్డు



అంతర్జాతీయ కస్టమ్స్ డే-2024 సందర్భంగా, విజయవాడలోని కస్టమ్ ప్రివెంటివ్ కమిషనరేట్ కార్యాలయం వారిచే ఇటీవల శ్రీసిటీకి చెందిన సిద్ధార్థ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు ఉత్తమ దిగుమతిదారు అవార్డు దక్కింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పనితీరు ఆధారంగా ఈ ఎంపిక జరుగుగా, ఈ నెల 27న కాకినాడలో జరిగిన కార్యక్రమంలో కస్టమ్స్, సెంట్రల్ పన్నుల చీఫ్ కమిషనర్ నుండి సిద్ధార్థ కంపెనీ జనరల్ మేనేజర్ నవీన్‌కుమార్ ఈ అవార్డును అందుకున్నారు. సిద్ధార్థ లాజిస్టిక్స్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకోవడం ఇది వరుసగా రెండవ సంవత్సరం కావడం విశేషం. ఆ పరిశ్రమ సిబ్బంది సమిష్టి కృషికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందని సిద్ధార్థ లాజిస్టిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ నిశ్చల్ పాధ్య సంతోషం వ్యక్తం చేశారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సిద్ధార్థ లాజిస్టిక్స్ బృందాన్ని అభినందించారు.

## క్రికెట్‌లో సత్తాచాటిన వెంకటాచలం జట్టు

సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని ఇటీవల వెంకటాచలంలో నిర్వహించిన కాకాణి రమణారెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో వెంకటాచలం జట్టు తన సత్తాచాటుకుని విజేతగా నిలిచి రూ.50వేల బహుమతిని, ట్రోఫీని అందుకుంది. రన్నర్స్‌గా నిలిచిన సర్వేపల్లి జట్టు రూ.25వేల బహుమతిని పొందింది. వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య చేతుల మీదుగా విజేతలకు ఈ బహుమతులు ప్రదానం చేశారు. పోటీల నిర్వాహకుడు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి.. కన్నులపండువగా కుంకుమార్చన



దేవాదాయ ధర్మాదాయ శాఖ ధార్మిక పరిషత్ ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా ఇటీవల నెల్లూరురూరల్ మండలంలోని పొట్టేపాళెం శ్రీకోదండరామ స్వామి దేవస్థానంలో కొలువైవున్న శ్రీరాజ రాజేశ్వరిదేవి అమ్మవారికి విశేష కుంకుమార్చన జరిగింది. ఆలయ ప్రధానార్చకుడు రఘురాంశర్మ, వేద పారాయణదారుడు రామకృష్ణశర్మ, అర్చకుడు నరసింహ ఆధ్వర్యంలో కన్నులపండువగా జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తలు రామ్మోహన్‌రెడ్డి, నెల్లూరులోని శ్రీ రాజ రాజేశ్వరి అమ్మవారి దేవాలయం ఛైర్మెన్ రత్నం జయరామ్, ఇఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు. అనంతరం భక్తుల కోలాటం కార్యక్రమం అందరినీ అలరించింది.




## 'ఆసరా' సంబరాల్లో బీఎంఆర్

బుచ్చిరెడ్డిపాలెంలో ఇటీవల జరిగిన 4వ విడత ఆసరా సంబరాల్లో కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బీఎంఆర్) పాల్గొన్నారు. బుచ్చి మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు అందరూ పాల్గొని విజయవంతం చేసినందుకు వారు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా, ఇందుకూరుపేట మండలంలో జరిగిన ఆసరా సంబరాల్లో కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కోవూరు యువజన విభాగం అధ్యక్షులు నల్లపరెడ్డి రజత్ కుమార్‌రెడ్డి పాల్గొని లబ్దిదారులకు చెక్కులను అందజశారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరుపేట వైకాపా మండల అధ్యక్షులు మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ ఛైర్మెన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, నాయకుడు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చాముండేశ్వరిదేవి ఆలయానికి.. రూ. లక్ష విరాళం

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగపట్నం చాముండేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో అన్నప్రసాద వితరణకు నెల్లూరుకు చెందిన భక్తులు మద్దినేని విజయభాస్కర్ నాయుడు, రాజ్యలక్ష్మి దంపతులు, వారి కుమారుడు-కుమార్తె వివేక్ చరణ్, చైతన్యహర్షిణిలు ఇటీవల లక్ష రూపాయల విరాళం సమర్పించారు. ఆలయ ఇఓ బండి శాంతయ్యకు ఆ మొత్తాన్ని ఈనెల 28న వారు అందజేశారు.

# కాపులకు ఇదే మంచి తరుణం...!



గత పది సంవత్సరాలుగా... అంటే, 2014 ఎన్నికలకు ముందు నారా చంద్రబాబునాయుడు సుదీర్ఘ పాదయాత్ర ప్రారంభించిన నాటి నుంచి ఆంధ్రలో కాపులకు రాజకీయంగా మంచి కాలం మొదలైనట్టుగా కనబడుతోంది. సంఖ్యా పరంగా ఏ ఒక్క కులం కంటే కూడా కాపు(కాపు, తెలగ, బలిజ, ఒంటరి) కులస్తులు అధిక సంఖ్యలో ఉన్నారనే భావం సమాజంలో ఉండడంతో, రాష్ట్ర రాజకీయాల చూపు కాపు కులం పైకి మళ్ళింది.

కాపులలో దాదాపు 75శాతానికి పైబడి ఆర్థికంగా బాగా వెనుకబడి ఉన్నారనడంలో మరో అభిప్రాయానికి తావులేదు. గ్రామాలలో అయితే చిన్నపాటి రైతులు, రైతు కూలీలు, చిన్న చిన్న జీవనోపాధి వృత్తులు, పట్టణాల్లో అయితే చిన్న చిన్న రోజువారీ వృత్తులు, ఆటో... ఇతర వాణిజ్య వాహనాల డ్రైవర్లుగా, హెల్పర్లుగా, రోడ్ల పక్కన చిన్న చిన్న రోజువారీ వ్యాపారాలు చేసుకుంటూ పొట్టపోసుకునే వారిగా కాపులు పెద్ద సంఖ్యలో కనిపిస్తూ ఉంటారు.

విద్య, ఉపాధి వ్యవహారాలలో వారికి ప్రభుత్వం చేయూత ఇవ్వాల్సిన అవసరాన్ని 2014 ఎన్నికలకు ముందు చేపట్టిన పాదయాత్ర సందర్భంగా చంద్రబాబునాయుడు పదేపదే ప్రస్తావించారు. నిజానికి, కాపుల ఆర్థిక, సామాజిక వెనుకబాటు తనాన్ని అంత బలంగా, స్పష్టంగా, సూటిగా ప్రస్తావించిన ఆ స్థాయి నాయకుడు చంద్రబాబు కంటే ముందు ఎవరూ లేరు.

2009 ఎన్నికలకు ముందు అప్పటి ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖరరెడ్డి కాపుల సమస్యను ప్రస్తావించినప్పటికీ, ఆ ప్రస్తావనలో 'ఫోర్స్' లేదు. కమిట్‌మెంట్ కనపడలేదు. ఏదో క్యాజువల్‌గా మాట్లాడినట్టుగా మాట్లాడారు. అందుకే, 2009 ఎన్నికల్లో గెలిచిన తరువాత, రాజశేఖరరెడ్డి ఆ ప్రస్తావన తీసుకురాలేదు.

కాపులకు రిజెర్వేషన్ అంశంపై, చంద్రబాబునాయుడు మాటల్లో వ్యక్తమైన సీరియస్‌నెస్ రాష్ట్రంలోని కాపుల ఇంటింటికీ చేరింది. చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడితే, తమ చిరకాల స్వప్నం అనుభవంలోకి వస్తుందని కాపులు ఆశించారు. అందుకే, 2019 వరకు రాష్ట్రంలో కాపులకు చంద్రబాబే నాయకుడు అని 2016 జనవరిలో ఆంధ్రజ్యోతి ఎడిట్ పేజీ వ్యాసంలో రాశాను.

చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక, కాపులకు సంబంధించి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. పేద కాపులకు విద్య, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రత్యేకంగా ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. కాపుల అభ్యున్నతికి సంబంధించి, ప్రభుత్వ పరంగా ఇది చాలాపెద్ద ముందడుగు.

రిజర్వేషన్లకు సంబంధించి, బీసీలలో తలెత్తిన అపోహల నేపథ్యంలో చంద్రబాబు నాయుడు నిర్ణయం మాత్రం తీసుకోలేకపోయారు.

కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తే, స్థానిక సంస్థల పాలకవర్గాలలో ప్రస్తుతం బీసీలకు గల రిజర్వేషన్లు కాపులకూ వర్తిస్తాయని బీసీలలో ఆందోళన వ్యక్తం అయింది.

తెలుగుదేశం పార్టీకి వెన్నెముక లాంటి బీసీ వర్గంలో తలెత్తిన ఈ ఆందోళనను ఎలా హ్యాండిల్ చేయాలన్నది ప్రభుత్వానికి కూడా ఒక పట్టాన అర్థం కాలేదు. చంద్రబాబు ఇరుకున పడిపోయారు.

కాపులకు రిజర్వేషన్ కోసం అప్పటి తూర్పు గోదావరి జిల్లా కిర్లంపూడి గ్రామమే తన కార్య క్షేత్రంగా మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం చేపట్టిన నిరసన కార్యక్రమాలు ఒక పక్కన... ఇటు బీసీలలో ఎగసిపడుతున్న ఆందోళనలు రెండో పక్క మధ్యలో చంద్రబాబునాయుడు నిజంగానే నలిగిపోయారు.

నిజానికి కాపులకు విద్య, ఉపాధి అవకాశాలలో రిజర్వేషన్లకు బీసీలు వ్యతిరేకంగా ఎప్పుడూ మాట్లాడ లేదు. కాపులు సంఖ్యాపరంగా బాగా ఎక్కువగా






ఉన్నందున, స్థానిక సంస్థల పాలక వర్గాలలో తమకు ఉండే రిజర్వేషన్లలో అధిక భాగాన్ని వారు ఎగరేసుకుపోతారేమోనని మాత్రమే బీసీలు ఆందోళనకు లోనయ్యారు. విషయం చాలా సున్నితంగా తయారైంది.

అగ్రవర్ణాలుగా గుర్తింపు పొందుతున్న బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ, కమ్మ, వెలమ, మొదలైన కులాల సరసనే కాపు కులం కూడా ఉంటున్నప్పటికీ, రాష్ట్రంలో ఓ పెద్ద కులంగా ఉన్న కాపుల ఆర్థిక వెనుకబాటును దృష్టిలో పెట్టుకుని, విద్య, ఉపాధిలో రిజర్వేషన్లు కల్పిస్తే బీసీలకు అభ్యంతరం ఉండదని, కాపులకూ అభ్యంతరం ఉండదని కాకినాడకు చెందిన "పుట్టు తెలుగు దేశీయుడు" గోకేడ రాంబాబు, అప్పటి హోంమంత్రి నిమ్మకాయల రాజప్పతో కలిసి, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి బలంగా తీసుకువచ్చారు.

చంద్రబాబు కూడా పూర్తిగా కన్విన్స్ అయ్యారు. అప్పటిదాకా ఆయనకు ఈ ఐడియా తట్టలేదు.

"ఒక మొండి సమస్యకు పరిష్కారం చూపెట్టారు.. థాంక్స్ రాజప్పా..." అంటూ వారిద్దరినీ ముఖ్యమంత్రి అభినందించారు.

విద్య, ప్రభుత్వ ఉపాధి రంగాలలో కాపులకు 5శాతం రిజర్వేషన్ వర్తింప చేయడానికి చంద్రబాబు సన్నద్ధం అయ్యేనాటికి, ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల వారికి 10 శాతం వర్తింపచేస్తూ కేంద్రం రాజ్యాంగ సవరణ చేసింది.

ఆ పది శాతంలో ఐదు శాతం కాపులకు వర్తింప చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక్క నిముషంలో నిర్ణయం తీసుకుంది.

కాపుల కల దాదాపుగా నెరవేరింది.

కానీ, అది అమలులోకి రాకుండానే అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి.

"ఏ స్లిప్ ఇన్ బిట్వీన్ ది కప్ & లిప్" అన్నట్టుగా, కాపు బిడ్డలకు విద్య, ఉపాధి అవకాశాలలో చంద్రబాబు పెట్టిన రిజర్వేషన్ ముద్ద... వారి నోటికి అందకుండానే నేల పాలైనట్టు అయింది.

కాల గమనంలో ఐదు సంవత్సరాలు గడిచాయి.

మళ్ళీ ఎన్నికలు వస్తున్నాయి.

వరద గోదారిలా చంద్రబాబుపై అప్పుడు విరుచుకుపడిన ముద్రగడ పద్మనాభం ఇప్పుడు జనసేన పార్టీ పట్ల సానుకూల భావనతో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. కాపు కమ్యూనిటీకి సంబంధించినంత వరకు ఇదొక సానుకూల పరిణామం.

కాపుల ఆర్థిక, సామాజిక వెనుకబాటును దృష్టిలో పెట్టుకుని సానుకూల దృక్పథంతో వ్యవహరించాల్సిన అవసరాన్ని పవన్ కళ్యాణ్, ముద్రగడ పద్మనాభం తదితర నేతలు గుర్తించాలి.

ఎన్నికల తరువాత ఏర్పడబోయే ప్రభుత్వాధినేతతో సానుకూలంగా, సౌమ్యంగా వ్యవహరించడం ద్వారా కాపు సమస్యకు పరిష్కారం సాధించాలి.

"కాపులకు రాజ్యాధికారం" అంటే ఏదో... ఎక్కడో లేదు. వారి పిల్లలకు విద్య, ప్రభుత్వ ఉపాధి మార్గాల మెరుగుదలలో ఉంది.

రాజకీయాలు పక్కనబెట్టి, వీరి వెనుక ఏపీలోని కాపులు (కాపు, తెలగ, బలిజ, ఒంటరి) సంఘటితం కావడంలో విజ్ఞత ఉంది. కాపు కుల అభ్యున్నతి ఉంది. అందుకు, ఇదే తగిన సమయం. రాజకీయాలు ఎందుకు? రోటీ, కపడా, ఔర్ మకాన్ కావాలి గానీ!


**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

# జగన్ సిద్ధం - బాబు సందిగ్ధం

(మొదటి పేజీ తరువాయి)

భాజపా పెద్దలు వేచిచూస్తున్నారు. ఇక ప్రస్తుత పరిస్థితులలో ఎవరికీ మిత్రపక్షం కాలేక, ఒంటరిగా బరిలో దిగే ధైర్యంలేక ఎవరు పిలుస్తారా అని వామపక్షాలు ఎదురు చూస్తున్నాయి.

## బదిలీలు.. భర్తీల బాటలో వైసీపీ..!



తాను కూడా ఊహించని విధంగా 2019 ఎన్నికలలో 151సీట్లతో జగన్‌మోహన్‌రెడ్డికి ముఖ్యమంత్రి గిరి అప్పజెప్పారు ఆంధ్ర ప్రజలు. ఓ సీనియర్ జర్నలిస్టు చెప్పినట్లుగా "నాకు 151 సరిపోవు, మొత్తం 175 కావాలి" అని మారాం చేస్తూ ముఖ్యమంత్రి 2024 ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. తన కింద పనిచేసే మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులతో ఆయనకి పనిలేదన్నట్లుగా ఆయన ఇన్నాళ్ళు వ్యవహరించారు. "తాను ప్రజలకి నేరుగా డబ్బులిస్తున్నాను. ప్రభుత్వ పథకాలు పొందే అర్హత ఉన్న అన్ని కుటుంబాలకి మధ్యవర్తులతో పనిలేకుండా నేరుగా వారి ఖాతాలలోనే లక్షల కోట్లు కుమ్మరించాను, కాబట్టి మిగిలినవాళ్ళతో పనిలేకుండా ప్రజలు తనని గెలిపిస్తారు" ఇదీ మొన్నటి వరకు ముఖ్యమంత్రి ధీమా. కానీ, నిఘావర్గాల నుండి వస్తున్న సమాచారం చూసి ఆయనకే కాదు, ఆయన సలహాదారులకి కూడా దిమ్మ తిరిగిందని అంటున్నారు ఆ పార్టీ శ్రేణులు.

"ఈసారి ఎవరు గెలుస్తారు...?" అని రహస్య గూఢచారులు సామాన్య జనాన్ని ప్రశ్నిస్తే "మా ఎంఎల్ఏ ఓడిపోతారు, కానీ మళ్ళీ జగనే సీఎం" ఇదీ... చాలాచోట్ల అమాయక జనాలనుండి వాళ్లకి వచ్చిన సమాధానం. అదెలా సాధ్యం...? ఇంత మంది శాసనసభ్యులు ఓడిపోతే మళ్ళీ జగన్ ఎలా సీఎం అవుతారు..?? అన్నది ఆ గూఢచారుల అనుమానం. ఇదే అనుమానాన్ని వాళ్ళు ముఖ్యమంత్రి, పార్టీ సలహాదారుల ముందు ఉంచారని పార్టీవర్గాల సమాచారం. తాడేపల్లిలో కూర్చుని తానెంత చేసినా, తాను మళ్ళీ సీఎం పీఠం చేజిక్కించుకోవాలంటే క్షేత్రస్థాయిలో పనిచేసే నాయకులు, కార్యకర్తలే దిక్కన్న వాస్తవాన్ని తమ నాయకుడు గ్రహించాడని ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకుల అభిప్రాయం. తమ నాయకుడు ఆయన చుట్టూ చేరిన భజన బృందాల మాటలు నమ్మడం మాని వాస్తవాలు గ్రహించాడన్నది వారి అభిప్రాయం. ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రక్షాళన మొదలుపెట్టారు. కొన్నిచోట్ల నాయకులని అటుకులు చిటుకులుగా ఒక నియోజకవర్గం నుండి మరో నియోజకవర్గానికి బదిలీ చేస్తున్నారు. కొన్ని స్థానాలని కొత్తవాళ్ళతో భర్తీ చేయడానికి కసరత్తు చేస్తున్నారు.

గత ఎన్నికలలో.. అంటే 2019లో ఒకేసారి 175 మంది అభ్యర్థుల జాబితా ప్రకటించి ప్రాంతీయపార్టీల నిర్ణయాలు ఎలాఉంటాయో స్పష్టంగా చూపించే ప్రయత్నం చేసింది వైసీపీ అధిష్టానం. కానీ, అదే వైసీపీ అధిష్టానం ఈసారి విడతలవారీగా అభ్యర్థుల జాబితా ప్రకటిస్తూ, జాతీయపార్టీల విధానాన్ని అనుసరిస్తోందంటే, తమ పార్టీ నాయకులపైన ప్రజలలో అసంతృప్తి ఏ స్థాయిలో ఉందన్న విషయం స్పష్టమవు తోందని ఒక సీనియర్ వైసీపీ నాయకుడు అభిప్రాయపడ్డారు. ఇప్పటికి అయిదు జాబితాలని వైసీపీ విడుదల చేసింది. 13 లోక్‌సభ, 59 శాసనసభ స్థానాలకి అభ్యర్థులను ప్రకటిం చేసింది. పార్టీ నిర్ణయంతో నిరాశ చెందినవారు అక్కడక్కడా తిరగబడుతున్నారు. ఎంపీలు, ఏంఎల్ఏలు ఒక్కొక్కరుగా పార్టీని వదిలి బయటకి వస్తున్నారు. తాడేపల్లిలో ప్రక్షాళన పూర్తై శాసనసభ 175, పార్లమెంటు 25 మొత్తం కలిపి 200 సీట్ల అభ్యర్థుల జాబితా బయటకి వస్తేకానీ వైసీపీలో ఉన్న లుకలుకలు, అలకలు పూర్తిస్థాయిలో బయటపడవు.

## పొత్తుల పాట... అభ్యర్థుల వేటలో టీడీపీ!

వైసీపీ ఇప్పటికే కొంతమంది అభ్యర్థులను ప్రక టించి బరిలో దింపితే, టీడీపీ మాత్రం ఇంకా ఆ దిశగా అడుగులు వేయలేదు. రాష్ట్రం మొత్తంమీద 10శాతం సీట్లకి కూడా తెలుగుదేశం అధినేత అభ్యర్థులను నిర్ణయించలేదు. టీడీపీ - జనసేన కలసి ఎన్నికలకి వెళ్లనున్నట్లు ఆ రెండు పార్టీలూ ఎప్పుడో ప్రకటించాయి. అయితే ఎవరెవరికి, ఎన్ని... ఎవరెవరు ఎక్కడెక్కడ..? అన్న స్పష్టత ఆ పార్టీలలో ఇంకా రానందున తమ అభ్యర్థుల ప్రకటన లేటవుతోందని ఇరు పార్టీల నాయకులు చెప్తున్నారు. మరోవైపు భాజపా కూడా తన నిర్ణయం ప్రకటించలేదు. పవన్ ఓ వైపు కమలదళంతో దోస్తీ చేస్తూనే, మరోవైపు తెలుగుతమ్ముళ్ళతో చేయి కలిపారు. భాజపా కూడా తెలుగుదేశంతో కలిస్తే ముగ్గురూ కలిసి జగన్మోహన్‌రెడ్డిని ఎదుర్కోవాలన్నది పవన్ - బాబుల ఆశ, ఆలోచన. అయితే, ఢిల్లీ పెద్దలు ఇంకా తమ నిర్ణయం ప్రకటించకపోవడంతో పొత్తులపై స్పష్టత రావాల్సివుంది. టీడీపీతో కలవడానికి బీజేపీ ఒప్పుకోకపోతే జనసేన ఒకరితో తెగతెంపులు చేసుకోవలసి ఉంటుంది. ఆ ఒక్కరు ఎవరు అన్నది కూడా మిలియన్ డాలర్ల ప్రశ్న. ఒకవేళ ముగ్గురూ కలిస్తే అక్కడ మళ్ళీ ఎవరెవరికి ఎన్ని సీట్లన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది.

మరోవైపు వైసీపీలో జరుగుతున్న ప్రక్షాళన పూర్తయ్యాక, ఆ పార్టీ నుండి ఎంతమంది అలిగి తమ పార్టీలోలలోకి వస్తారో వేచిచూడాలన్న ఆలోచన కూడా, ఆ రెండు పార్టీల అభ్యర్థులను ప్రకటించే విషయంలో ఆలస్యానికి ఒక కారణమని విశ్లేషకులు చెప్తున్నారు. మరో వారం లేదా పదిరోజుల్లో భాజపాతో పొత్తు విషయంలో స్పష్టత, వైసీపీపై అలిగిన వారి తుది జాబితాపై క్లారిటీ వచ్చే అవకాశాలు ఉండడంతో అప్పటివరకు నిరీక్షణ తప్పదని ఆ మూడు పార్టీల నాయకులు భావిస్తున్నారు. తాడేపల్లి వైసీపీ బృందం తమ అభ్యర్థుల విషయంలో మల్లగుల్లాలు పడుతూ, విడతల వారీగా అభ్యర్థులను ప్రకటిస్తూ యుద్ధానికి సిద్ధం అంటుంటే... టీడీపీ మాత్రం ఇంకా పొత్తులు, ఎత్తుల పనిలో సందిగ్ధంలో ఉంది!





జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం ఇటీవల నగరంలోని తిక్కన ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధ్యక్షత వహించగా జిల్లా ఎస్పీ డా. తిరుమలేశ్వరరెడ్డి, జిల్లా డెప్యూటీ రవాణా కమిషనర్ చందర్ పాల్గొన్నారు. జిల్లాలో ప్రమాదాల నివారణ కోసం తీసుకోవాల్సిన అనేక చర్యలపై ఈ సమావేశంలో చర్చించారు. ప్రమాదాల నివారణ దిశగా పూర్తిస్థాయిలో అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలలో అవగాహన కల్పించి చైతన్యవంతులను చేయాలని కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

# పొదుపు మహిళలకు..ప్రభుత్వం 'ఆసరా' - ఎంపీ ఆదాల



పొదుపు మహిళలకు తమ ప్రభుత్వం 'ఆసరా'గా ఉంటూ, వారి అభ్యున్నతికి ఎంతగానో సహకరిస్తోందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. పొదుపు సంఘాల మహిళలకు నాలుగో విడత ఆసరా సంబరాల కార్యక్రమాన్ని నెల్లూరులోని పరమేశ్వరి కళ్యాణమండపంలో జనవరి 31న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల వారికి ఇచ్చిన మాట ప్రకారం ఎంత కష్టమైనా వారి ఆర్థిక తోడ్పాటుకు పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని పేర్కొన్నారు. మహిళలందరూ మంచి మనసుతో ఆలోచించి వైయస్ జగన్‌కి అండగా నిలవాలని, నెల్లూరు రూరల్ అభ్యర్థిగా పోటీచేస్తున్న తనకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని పలు గ్రామాల పొదుపు సంఘాలకు సంబంధించి 4వ విడత ఆసరా చెక్కును పొదుపు సంఘాల సభ్యులకు అందించారు. జగన్ చిత్రపటానికి పొదుపు సంఘాల మహిళలు పాలాభిషేకం చేశారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ స్రవంతి, డీసీసీబీ మాజీఅధ్యక్షులు ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఏఎంసి ఛైర్మెన్ పేర్నేటి కోటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

# మీకు అండగా ఉంటాం..

## బాధిత కుటుంబాలతో నారా భువనేశ్వరి



ఇటీవల మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్ట్‌తో మనస్తాపానికి గురై మృతిచెందిన పలువురి కుటుంబాలను ఓదార్చేందుకు, వారికి ధైర్యం చెప్పేందుకు చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి సిద్ధమయ్యారు. జనవరి 31న ఆమె ఆమేరకు నెల్లూరుజిల్లా విడవలూరు మండలంలో 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా కరేడు పంచాయతీలోని టెంకాయచెట్లపాళెం గ్రామంలో వాయిల సుందరరావు కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆ కుటుంబానికి తాము అండగా ఉంటామని ఆమె చెప్పారు. అదేవిధంగా ఆత్మకూరు పంచాయతీలోని ఆదిఆంధ్ర కాలనీలో ఎండ్లూరి కోటయ్య కుటుంబసభ్యులను కూడా ఆమె పరామర్శించారు. బాధిత కుటుంబాలకు 3 లక్షల రూపాయల వంతున చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఎమ్మెల్సీ కె.శ్రీకాంత్, జడ్పీ మాజీ ఛైర్మెన్ బాలాజీ, టీడీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధమవుతున్న జీఎస్ఎల్వి-ఎఫ్14

### ❍ 17న.. ప్రయోగం

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో రాకెట్ ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఫిబ్రవరి 17న శ్రీహరికోటలోని షార్ నుంచి జీఎస్ఎల్వి ఎఫ్ 14ని అంతరిక్షంలోకి ప్రయోగించడానికి ఇస్రో శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ రాకెట్ ద్వారా ఇన్‌శాట్-3డిఎస్ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి పంపనున్నారు. ఇన్‌శాట్ వ్యవస్థను పటిష్టం చేసుకునేందుకు ఈ ప్రయోగం నిర్వహించాలని ఇస్రో శాస్త్రవేత్తలు నిర్ణయించారు. వాతావరణ పరిశోధనలకు, భూమి-సముద్ర ఉపరితలాల పరిశీలనలకు ఉపయోగపడేలా ఇన్‌శాట్-3డిఎస్ ఉపగ్రహాన్ని రూపొందించారు.

## కాలధర్మం

### ప్రముఖ కాంట్రాక్టర్

# నెల్లూరు గోపాలరెడ్డి



పాతతరం కాంట్రాక్టర్ నెల్లూరు గోపాలరెడ్డి తన 90వ యేట ఫిబ్రవరి 1వ తేదీ గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. నెల్లూరుజిల్లాలో చాలామంది కాంట్రాక్టర్లకి గోపాలరెడ్డి స్ఫూర్తి. స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్‌గా ఆంధ్ర, మహారాష్ట్రలలో 1960-2004 మధ్య అంటే దాదాపు 44 సంవత్సరాలు అనేక భారీ నిర్మాణాలకు గోపాలరెడ్డి సారథ్యం వహించారు. పొదలకూరు మండలం బత్తులపల్లి గోపాలరెడ్డి స్వగ్రామం. తమ అమ్మానాన్నల అయిదు మంది సంతానంలో గోపాలరెడ్డి పెద్దవాడు. ఆయనకి కుమారుడు భాస్కరరెడ్డి, కుమార్తె విజయలక్ష్మి ఉన్నారు. కుమారుడు కూడా తండ్రి బాటలోనే కాంట్రాక్టు రంగంలోనే రాణిస్తున్నారు. కుమార్తె విజయ సామంతు వారి కోడలు. సామంతు రఘురామిరెడ్డి కుమారుడు, నెల్లూరు, పొగతోటలోని విజయ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఎస్.వీ.కృష్ణారెడ్డి గోపాలరెడ్డి అల్లుడే. కొంతకాలంగా అనారోగ్యంతో ఉంటూ గురువారం ఉదయం గోపాలరెడ్డి కన్నుమూశారు. గోపాలరెడ్డి కుటుంబసభ్యులకి ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతోంది 'లాయర్'.

### లక్ష్మీస్కాన్ సుబ్బారావు సతీమణి

# గట్టు విమల



నెల్లూరు పొగతోటలో ప్రసిద్ధిగాంచిన శ్రీ లక్ష్మీ స్కాన్ & ఎక్స్‌రే అధినేత డాక్టర్ గట్టు సుబ్బారావు సతీమణి గట్టు విమల జనవరి 27వతేదీ శనివారం కన్నుమూశారు. ఆకస్మిక అనారోగ్యంతో చికిత్స పొందుతూ చిన్నవయస్సులోనే తన 57వ ఏట విమల అసువులు బాశారు. ఆమె స్వగ్రామం తలమంచి. 1985, ఆగస్టు 24న డాక్టర్ సుబ్బారావుని పరిణయమాడి గట్టు వారి కోడలయ్యారు. సుబ్బారావు-విమల దంపతులకు ఇద్దరు సంతానం. కొడుకు డాక్టర్ అన్వేష్, కూతురు లక్ష్మి. తన కుమార్తె లక్ష్మి పేరుతోనే సుబ్బారావు సంస్థని నెలకొల్పారు. ఇంటి దీపాన్ని కోల్పోయిన గట్టు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.





## జేసీ కూర్మనాథ్ బదిలీ

### - కొత్త జేసీగా రాజేంద్రన్ -

నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఉన్న కూర్మనాథ్ బదిలీ అయ్యారు. ప్రకృతి విపత్తుల విభాగం డైరెక్టర్‌గా ఆయన నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఐఏఎస్ అధికారుల బదిలీలలో భాగంగా ఆమేరకు ప్రభుత్వం ఈనెల 28న ఉత్తర్వులిచ్చింది. ఆయన స్థానంలో కొత్త జేసీగా నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌ను నియమించారు. ఆయన ఇటీవలే బాధ్యతలు స్వీకరించారు కూడా!

## డిఎఫ్ఓగా శ్రీనివాసులురెడ్డి



సోషల్ ఫారెస్ట్ రాష్ట్ర కార్యాలయంలో డిఎఫ్ఓగా పనిచేస్తున్న శ్రీనివాసులురెడ్డిని సామాజిక వన విభాగం జిల్లా అటవీ క్షేత్రాధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఈనెల 28న ఆదేశాలు జారీ చేయడంతో ఆయన అదేరోజున ఆమేరకు బాధ్యతలు చేపట్టారు. నగరంలోని పొదలకూరు రోడ్డులో ఉన్న సామాజిక వన విభాగం కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించడంతో అటవీ రేంజర్లు మాల్యాద్రి, శివకుమార్‌రెడ్డి, రామకృష్ణ, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## కొత్త డీఎస్ఓగా వెంకటరమణ

జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి (డిఎస్ఓ)గా శ్రీకాకుళం డిఎస్ఓ డి.వెంకటరమణను బదిలీపై నెల్లూరులో నియమిస్తూ ఆ శాఖ కమిషనర్ ఈనెల 27న ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ డిఎస్ఓగా పనిచేస్తున్న టి.వెంకటేశ్వర్లును కమిషనర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

## విజేతలకు బహుమతులు



'ఆడుదాం ఆంధ్ర' క్రీడాపోటీల్లో భాగంగా ఇటీవల ఆత్మకూరు నియోజక వర్గం స్థాయిలో ఏర్పాటుచేసిన క్రీడా పోటీల్లో విజేతలకు ఆత్మకూరు ఎంపీడీఓ, ఆర్డీఓ కార్యాలయం ఏఓలు బహుమతులు అందజేశారు. షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఆత్మకూరు జట్టు, క్రికెట్‌లో మర్రిపాడు జట్టు, కబడ్డీ-వాలీబాల్ పోటీల్లో సంగం మండల జట్టు, ఖోఖోలో అనుమ సముద్రంపేట (ఏఎస్‌పేట) జట్టు విజేతలు కావడంతో వారందరినీ అధికారులు అభినందించారు. ఈ పోటీల్లో విన్నర్స్‌గా నిలిచిన జట్లు జిల్లాస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు అధికారులు తెలిపారు.

# ఇందిరాభవన్‌లో గణతంత్ర వేడుకలు



నెల్లూరులోని ఇందిరా భవన్‌లో జనవరి 26న గణతంత్ర వేడుకలు జరిగాయి. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరంచి వందనం చేశారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి, నాయకులు ఉడతా వెంకట్రావు, షేక్ ఫయాజ్, డీసీసీ ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్, కిసాన్ సెల్ అధ్యక్షుడు ఏటూరు శ్రీనివాసులురెడ్డి, మోహన్, మైనార్టీ అధ్యక్షుడు షేక్.అల్లావుద్దీన్, సోషల్ మీడియా ఇన్చార్జి షేక్ హుస్సేన్‌బాషా, ఎన్.ఎస్.యూ.ఐ అధ్యక్షుడు రాజా, యూత్ కాంగ్రెస్ నగర అధ్యక్షుడు నాగిరెడ్డి రాజేష్‌రెడ్డి, కిషోర్‌బాబు, షేక్ రిజ్వాన, సుజాత, నరేష్ తదిరులు పాల్గొన్నారు.

## విఎస్‌యులో..



నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జి.యం.సుందర వల్లి పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనం చేశారు. విద్యార్థులకు ఆమె గణతంత్ర దినోత్సవ విశిష్టతను వివరించి, అందరికీ రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఎస్‌యు రిజిస్ట్రార్ ఆచార్య పి.రామచంద్రారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.విజయానందకుమార్ బాబు, భోధన, భోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహాత్మునికి 'విఆర్‌సి వాకర్స్' నివాళులు



మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జనవరి 30న నెల్లూరులోని విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ వారు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మణ్ కుమార్‌రెడ్డి, సభ్యులు డాక్టర్ భాస్కర్‌రావు, డాక్టర్ సుమన్ కృష్ణారెడ్డి, డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ రాము, డాక్టర్ ఎస్ఎన్ రాజు, డాక్టర్ ఈశ్వరరెడ్డి, 'అమ్మ ఫర్నిచర్స్' అధినేత గడ్డం సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## మహనీయుడు డా. అంబేద్కర్



జనవరి26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత రాజ్యాంగ రూపశిల్పి డా. బాబాసాహెబ్ అంబేద్కర్ మహనీయుడని, బడుగు బలహీన దళిత వర్గాలకు ఆయన ఆశాజ్యోతి అని కొనియాడుతూ జిల్లా ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ నాయకులు మందా బాబ్జి తదితరులు జోహార్లర్పించారు. నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లోని డా. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అసోసియేషన్ నాయకులు కుల్లూరు ప్రభాకర్, రాపూరు రమణయ్య, కొమ్మల కృష్ణయ్య, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్పాస్టిక్ సెంటర్‌లో...



నెల్లూరులోని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఉన్న ఎంఎస్ఆర్ స్పాస్టిక్ సెంటర్‌లో జనవరి 26న గణతంత్ర వేడుకలు జరిగాయి. రెడ్ క్రాస్ కోశాధికారి పి.సురేష్‌కుమార్ జైన్, స్పాస్టిక్స్ సెంటర్ అడ్వైజర్, మేనెజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్ర ప్రసాద్, యడవల్లి సురేష్‌తో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేశారు. స్పాస్టిక్ సెంటర్ కో-కన్వీనర్ నలుబోలు బలరామయ్యనాయుడు, సబ్ కమిటీ మెంబర్ విశ్వం, ప్రిన్సిపల్ గురునాథం పాల్గొన్నారు.

## 'డైట్'లో...



ఇందుకూరుపేట మండలం, పల్లిపాడులోని ప్రభుత్వ డైట్ (జిల్లా విద్యా శిక్షణా సంస్థ)లో జనవరి 26న 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్, డైట్ సీనియర్ అధ్యాపకులు డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఉపన్యాసకులు డి.నర్సింగరావు, కె.విజయచంద్ర, యస్.బి.దాస్, యన్.శివ, సి.సోమేశ్వర్, కె.షఫీ అహ్మద్, కార్యాలయ సూపరింటెండెంట్ యస్.సురేష్, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

## జీవిఆర్ఆర్ కళాశాలలో..



రక్తదానమంటే ప్రాణదానమేనని, రోగార్తులు.. బాధితులకు ప్రాణాపాయ సమయంలో రక్తదానం వారి ప్రాణాలను కాపాడుతుందని, రక్తదానానికి యువత మరింతగా ముందుకు రావాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆంధ్రప్రదేశ్ ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ పుట్టా శేషు పిలుపునిచ్చారు. 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రెడ్ క్రాస్ సౌజన్యంతో నెల్లూరులోని జీవిఆర్ఆర్ జూనియర్ కళాశాలలో సేవాభారతి, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్‌ల ఆధ్వర్యంలో జనవరి 26న జరిగిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదాతలను అభినందించారు. మొత్తం 75 మంది రక్తదాతలు పాల్గొని రక్తదానం చేశారు. కళాశాల ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ దోర్నాదుల వెంకటేశ్వర్లు, విభాగ్ సేవా ప్రముఖ్ బి.మల్లికార్జున, ముత్తు, సతీష్ సేవాభారతి కార్యకర్తలు పాల్గొన్నారు.

## టూకీగా...



### రూరల్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీచేసిన ఐజీ

నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌ను జనవరి 27న పోలీస్ ఇన్స్‌పెక్టర్ జనరల్ (ఐజీ) తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. ఆయనతో పాటు రూరల్ సీఐ సుబ్బారావు పాల్గొన్నారు.

### నెల్లూరులో పేకాటరాయుళ్ల అరెస్ట్

నెల్లూరులోని జాకీర్‌హుస్సేన్‌నగర్‌లో పెన్నానది వద్ద పేకాటాడుతున్న నలుగురిని నవాబుపేట పోలీసులు జనవరి 28న అరెస్టు చేశారు. వారివద్ద నుంచి రూ.20 వేల రూపాయలను స్వాధీనం చేసుకునన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

### నర్రవాడ దేవాలయంలో ధర్మప్రచారం

దుత్తలూరు మండలం నర్రవాడలోని శ్రీ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి దేవాలయంలో జనవరి 28న ధర్మ ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా, తొలుత అమ్మవారికి ప్రత్యేకపూజలు చేసి పల్లకిసేవ నిర్వహించారు. ఉప ప్రధాన అర్చకుడు బెల్లంకొండ పెదభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

### జగదేవిపేటలో వ్యవసాయ విద్యార్థులకు సదస్సు

ఇందుకూరుపేట మండలంలోని జగదేవిపేటలో జనవరి 27న ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులకు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు లోకేష్‌బాబు, కిరణ్‌కుమార్‌రెడ్డిలు పంటల సాగులో వచ్చే తెగుళ్ళు, వాటి నివారణల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు నవీన్, సుమలత తదితరులు పాల్గన్నారు.

### అక్కంపేట రామాలయంలో చోరీ

మనుబోలు మండలంలోని అక్కంపేట రామాలయంలో ఇటీవల చోరీ జరిగింది. దొంగలు ఆలయ తాళం పగులగొట్టి లోపలకి వెళ్లి సీతమ్మ అమ్మవారి మెడలో ఉన్న బంగారు దండతో పాటు వెండి జంధ్యం అపహరించారు. హుండీని కూడా పగులగొట్టి దాంట్లో భక్తులు వేసిన కానుకలన్నీ దోచుకుపోయారు. ఎస్ఐ అజయ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### గుడిపల్లిపాడులో కంప్యూటర్ ఎంబ్రాయిడింగ్

నెల్లూరు రూరల్ మండలంలోని గుడిపల్లిపాడులో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ఎంబ్రాయిడింగ్ సెంటర్‌ను జనవరి 27న మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్ర ప్రారంభోత్సవం చేశారు. మహిళల ఉపాధికి ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. స్థానిక కార్పొరేటర్ రామ్మోహన్, వైకాపా నేత నెల్లూరు పవన్‌కుమార్‌రెడ్డి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

### నూకనపల్లిలో 'వికసిత్ భారత్'


కలువాయి మండలం నూకలపల్లి గ్రామంలో జనవరి 28న వికసిత్ భారత్ సంకల్పయాత్ర జరిగింది. బీజేపీ నాయకులు ఎస్ఎస్ఆర్ నాయుడు, అధికారులు పాల్గొని ప్రధాని మోడీ సారధ్యంలో కేంద్రప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న పథకాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన వారంతా ఆ పథకాలను సద్వినియోగం చేసుకోవా లని కోరారు.

### కోవూరులో చట్టాలపై అవగాహన

కోవూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఇటీవల ఎస్సీ ఎస్టీ వర్గాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐడీ సిఐ వెంకటేశ్వర్లు పాల్గొని చట్టాల పట్ల వారికి అవగాహన కలిగించారు. డెప్యూటి తహశీల్దార్ ఇలియాజ్, సీఐడీ ఎస్ఐ షాజహాన్, ఏఎస్‌డబ్ల్యు తిరుపతయ్య, ఇఓపిఆర్డీ నాగూర్‌వలీ, సంక్షేమ శాఖాధికారులు వెంకట్రావు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

### సౌత్ రాజుపాళెంలో ఇద్దరు అదుపులోకి

నెల్లూరు రూరల్ మండలం సౌత్ రాజుపాళెంలో ఇటీవల కోడిపందాలు నిర్వహిస్తున్న ఇద్దరిని రూరల్ సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వారి వద్దనుంచి ఓ పందెం కోడిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com